PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి.....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 213, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 23 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## “మున్సిపల్ ఎన్నికల్లో అంతకన్నా ఎక్కువ సీట్లు గెల్చుకోవాలి”

- గుంటూరులో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు.
- గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది.



గుంటూరులో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. మిగతా 2లో

## కర్బన ఉద్గారాలపై అభివృద్ధి చెందుతున్న దేశాలనే నిందించడం సరికాదు

- వాతావరణంలో కలుస్తున్న కర్బన ఉద్గారాలకు బాధ్యతను అభివృద్ధి చెందుతున్న దేశాలపైనే పెట్టడం సరికాదని ప్రధాని మోదీ అన్నారు.
- ఇందుకు కారణం అవుతున్న దేశాలను వదిలేసి ప్రతిసారీ భారత్ వంటి దేశాలనే నిందిస్తున్నారన్నారు.



వాతావరణంలో కలుస్తున్న కర్బన ఉద్గారాలకు బాధ్యతను అభివృద్ధి చెందుతున్న దేశాలపైనే పెట్టడం సరికాదని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు కారణం అవుతున్న దేశాలను వదిలేసి ప్రతిసారీ భారత్ వంటి దేశాలనే నిందిస్తున్నారన్నారు. మిగతా 2లో

### ఎండాకాలం బూచి చూపి
## రైతులకు నీళ్లివ్వరా?



- జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే నీటిని విడుదల చేయాలన్న డీకే అరుణ
- జలాశయంలో ప్రస్తుతం సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడి
- రైతులు చేపట్టిన ఆందోళనలకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టీకరణ

పాలమూరు జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి నీటి కోసం రైతాంగం అల్లాడుతుంటే, రాబోయే ఎండాకాలాన్ని బూచిగా చూపి కాలువలకు నీటిని నిలిపివేయడం ఏమాత్రం సమంజసం కాదని మిగతా 2లో

- నారావారిపల్లి జన్మనిస్తే.. కుప్పం రాజకీయ జన్మనిచ్చింది : సీఎం చంద్రబాబు
- జూనియర్ డాక్టర్లకు ఏపీ సర్కార్ శుభవార్త.. స్టైఫండ్ పెంచుతూ ఉత్తర్వులు జారీ
- ఆయన జ్ఞాపకాలు మదిలో నిలిచి ఉంటాయి: శివప్రసాద్‌పై చంద్రబాబు
- మాజీ ఎంపీ నరమల్లి శివప్రసాద్ వర్ధంతి
- నివాళులర్పించిన సీఎం చంద్రబాబు
- శివప్రసాద్ తన చిన్ననాటి స్నేహితుడని పేర్కొన్న ముఖ్యమంత్రి
- మంత్రిగా, ఎంపీగా

### నా పాలనలో ఏ డీఎస్సీలోనూ
## అవకతవకలు జరగలేదు

**ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి.. సాక్ష్యాధారాలతో నిరూపిస్తాం**



- ప్రజాసేవతో పాటు సినిమా, నాటక రంగంలో ప్రత్యేకతను చాటుకున్నారన్న చంద్రబాబు

కుప్పంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీఎస్సీ నిర్వహణపై ప్రతిపక్షాలు కావాలని అబద్ధపు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. డీఎస్సీకి అసలైన చిరునామా చంద్రబాబు, టీడీపీయేనని, 16 వేల మందికి పైగా మిగతా 2లో

### గురువులపై గొడ్డలి పార్టీ నాయకుల
## దాడులు క్షమించరాని నేరం



- మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదు
- ఇదే మాట స్పష్టం చేసిన హైకోర్టు, విద్యాశాఖాధికారులు
- లిక్కర్ కేసుల నుంచి డైవర్షన్ కోసం దాడులు
- జగన్ కు దమ్ము, ధైర్యం ఉంటే చర్చకు రావాలి
- మెగా డీఎస్సీపైనా, గ్రూప్ 1 మూల్యాంకనంపైనా చర్చకు రెడీ
- జగన్ మాటలు నమ్మితే జైలుకే...
- రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- వైసీపీ క్యాడర్ కు మంత్రి సవిత హెచ్చరిక

‘గురు బ్రహ్మ, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః అంటూ గురువులను దైవంగా కొలుచుకునే సమాజం మనదని, అటువంటి దైవాలపై గొడ్డలి పార్టీ గూండాలు దాడి చేయడం దారుణం... ఒకవైపు లిక్కర్ స్కామ్, మరో వైపు గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనంలో అక్రమాలు బయటకు రావడంతో జగన్ బ్యాచ్ లో గగ్గోలు మొదలైంది... టీచర్ల ఆత్మగౌరం దెబ్బతిసేలా, వారిని కష్టాన్ని తక్కువ చేసి చూపేలా మెగా డీఎస్సీలో అక్రమాలు అంటూ విష ప్రచారం మిగతా 2లో

## దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయి

**టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం**

- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు



విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ ‘ఎక్స్’లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి మిగతా 2లో

## జూరాల ఆయకట్టు పంటలను కాపాడాలి



రైతుల పక్షాన పోరాడుతున్న నేతల అరెస్టు దుర్మార్గం

కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సిందిపోయి న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కారు కుట్ర చేస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో మండిపడ్డారు.

కళ్లముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను ప్రభుత్వం తీర్చాల్సిందిపోయి న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు మిగతా 2లో

### పిఠాపురంలో రూ. 6 కోట్లతో
## 11 చెరువుల ఆధునీకరణ

**మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్**

- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి



ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిగతా 2లో

### ‘దబాయించడం, బుకాయించడమే కాదు...
## ఎదురుదాడికి దిగుతున్నారు.



- ఏపీలో ప్రజాస్వామ్యం ఉందా?: సజ్జల
- డీఎస్సీలో అక్రమాలు చేసి, ఆ తప్పుల నుంచి బయటపడేందుకే వెన్నుపోట్ల పార్టీ దాడుల్ని కొనసాగిస్తోందని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వ ఆటలు సాగవని. న్యాయ స్థానాల ద్వారా పోరాడుతామని ఆయన హెచ్చరించారు.

డీఎస్సీలో అక్రమాలు చేసి, ఆ తప్పుల నుంచి బయటపడేందుకే వెన్నుపోట్ల పార్టీ దాడుల్ని కొనసాగిస్తోందని మిగతా 2లో

### వికసిత్ భారత్‌లో
## తెలంగాణ కీలకం

**ఇక అప్పులపైనే ఆధారపడం**

- ఆర్థిక వనరుల సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి
- కీలక ప్రాజెక్టులకు నిధుల కోసం ప్రైవేటు పెట్టుబడులపై దృష్టిపెడతాం... పెట్టుబడిదారుల నష్టభయం తగ్గించేలా ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగిస్తాం
- 30 వేల ఎకరాల్లో నెట్-జీరో మెగాసిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ
- తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఇకపై కేవలం ప్రభుత్వ రుణాలపైనే ఆధారపడే పాత విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.
- మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చుకొనే విధానంలో కచ్చితమైన మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు.




తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఇకపై కేవలం ప్రభుత్వ రుణాలపైనే ఆధారపడే పాత విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చుకొనే విధానంలో కచ్చితమైన మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఢిల్లీలో శనివారం జరిగిన ‘వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణానికి మిగతా 2లో

### ‘సర్’ ప్రక్రియ పేరుతో
## వికృత చేష్టలకు పాల్పడుతున్నారు



- సర్ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారన్న నారాయణ
- అద్వానీ, జైశంకర్ వంటి ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేశారని విమర్శ
- వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడాన్ని కూడా పెద్ద సమస్యగా చూపుతున్నారని మండిపాటు

ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ మిగతా 2లో

## "మున్సిపల్ ఎన్నికల్లో అంతకన్నా ఎక్కువ సీట్లు గెల్చుకోవాలి"

ఇందులో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడారు."2021లో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ 57 డివిజన్లకు 46 డివిజన్లు పార్టీ గెలుచుకుంది. ఈసారి జరిగే మున్సిపల్ ఎన్నికల్లో అంతకన్నా ఎక్కువ సీట్లు గెల్చుకోవాలి. అందరూ కలిసికట్టుగా ఎన్నికల పని చేయాలి. అభ్యర్థి ఎవరైనా అందరూ కలసికట్టుగా పనిచెయ్యాలి. ప్రతి కుటుంబానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేయాలి. గతంలో ఎలా గెలిచామో ఈసారి కూడా అలానే గుంటూరు మేయర్ గెలుచుకోవాలి" అని చెప్పారు.మాజీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామి రెడ్డి మాట్లాడుతూ.. 'గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్లకు కార్యకర్తలు నాయకులు సిద్ధంగా ఉండాలి. గుంటూరు మున్సిపల్ పీఠాన్ని గెలుచుకొని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి గిఫ్టుగా ఇవ్వాలి. అందరూ సమన్వయంతో పనిచేసి ఒక ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్దాం. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరటం ఖాయం" అని చెప్పారు.మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. "వైఎస్సార్‌సీపీకి మహిళలు వెన్నెముక. పార్టీ జెండాను మోసే కార్యకర్తలకే ప్రాధాన్యం ఉంటుంది. పార్టీలో కష్టపడిన వారికి న్యాయం జరుగుతుంది. మనం గర్వపడే నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రతి ఒక్క కార్యకర్త కూడా 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు" అని తెలిపారు.ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ... "డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి వైఎస్ జగన్ వైఎస్సార్‌సీపీని స్థాపించారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలనుంచి పుట్టిన పార్టీనే వైఎస్సార్‌సీపీ. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి రెండడుగులు ముందుకు వేస్తే వైఎస్ జగన్ నాలుగడుగులు ముందుకు వేశారు. 76 డివిజన్లలో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి.

## కర్బన ఉద్గారాలపై అభివృద్ధి చెందుతున్న దేశాలనే నిందించడం సరికాదు

"పర్యావరణం భవిష్యత్తు-వాతావరణ గతిశీలత' అనే అంశంపై జాతీయ హరిత ట్రైబ్యునల్ నేతృత్వంలో శనివారమిక్కడ మొదలైన 2రోజుల అంతర్జాతీయ సదస్సుకు మోదీ హాజరయ్యారు. ప్రపంచ సగటులో సగానికంటే తక్కువగానే భారత్‌లో కర్బన ఉద్గారాల స్థాయి ఉందని అన్నారు. జీ-20 దేశాల్లో ఒక్క భారత్ మాత్రమే పారిస్ సదస్సుకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని తెలిపారుదేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా మార్చే ప్రయాణంలో యువతదే కీలక పాత్ర అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రభుత్వంలో కొత్తగా ఉద్యోగాలు పొందిన వారు సమర్థత, నిజాయితీతో ప్రజలకు సేవలందించాలని, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని ఉద్బోధించారు. ప్రజా సేవను దేశ సేవగా భావించాలని, పౌరులకు ప్రాధాన్యతనిచ్చే దృక్పథం (సిటిజన్ ఫస్ట్ అప్రోచ్)తో విధులు నిర్వర్తించాలని కోరారు. శనివారం దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో 51వేల మందికిపైగా యువత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల నియామకపత్రాలు అందుకున్నారు. రెవెన్యూ, ఆర్థిక, రైల్వే, హోం, ఆరోగ్యం తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో వీరు సేవలందించనున్నారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటి వరకూ ఉద్యోగాలు పొందిన వారి సంఖ్య సుమారు 12.75 లక్షలకు చేరింది. నియామకపత్రాల అందజేత కార్యక్రమానికి ప్రధాని వర్చువల్‌గా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు, వారి కుటుంబాలకు అభినందనలు తెలిపారు. ఈ విజయానికి అభ్యర్థుల కఠోర శ్రమతో పాటు వారి కుటుంబాల త్యాగాలు కూడా కారణమని పేర్కొన్నారు. మారుతున్న ఆర్థిక వ్యవస్థ, పరిస్థితులకు అనుగుణంగా యువతను సిద్ధం చేయడంతో పాటు ఉపాధి కల్పనపై దృష్టి సారించామని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ విద్యా విధానం, స్కిల్ ఇండియా, పీఎం కౌశల్ వికాస్ యోజన వంటి కార్యక్రమాలను ఉదహరించారు. 'పీఎం సేతు' కార్యక్రమాన్ని కూడా ప్రస్తావించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి, పెట్టుబడుల్లో సుమారు 12 శాతం పెరుగుదల ఆర్థిక పురోగతికి సంకేతాలని ప్రధాని పేర్కొన్నారు.

## ఎండాకాలం బూచి చూపి రైతులకు నీళ్లివ్వరా?

మండిపడ్డారు. జూరాల జలాశయంలో ప్రస్తుతం సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని, కృష్ణా నదికి ఇంకా వరద వచ్చే అవకాశం కూడా ఉందని స్పష్టం చేశారు.ఒకవేళ వేసవిలో తాగునీటి ఎద్దడి వచ్చినా, ఎగువన కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి అక్కడి నుంచి నీటిని తెప్పించుకునేందుకు చొరవ చూపవచ్చని డీకే అరుణ సూచించారు. జూరాల డ్యాం రోడ్డు, కలెక్టరేట్ ఎదుట రైతులు చేపట్టిన ఆందోళనలకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని, రైతుల పోరాటానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. నీటి కొరత తీవ్రతను వివరిస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. సాగు చేసిన పంటలు చేతికందేలా కాలువలకు నీరు విడుదల చేయాలని కోరడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని రైతులు కూడా పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు.

## గురువులపై గొడ్డలి పార్టీ నాయకుల దాడులు క్షమించరాని నేరం

మొదలు పెట్టారు...రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ...టీచర్లపైనా, సామాన్యులపైనా దాడులు చేస్తే ఊరుకోబోమని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం..'అని జగన్ ను, వైసీపీ నాయకులను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. జగన్ కు దమ్ము, ధైర్యం ఉంటే మెగా డీఎస్సీ, గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనంపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. వైసీపీ కార్యకర్తలను జగన్ రెడ్డి పావులుగా వాడుకుంటున్నారన్నారు. ఆయన మాటలు నమ్మి దాడులకు తెగబడితే నష్టపోయేది వైసీపీ కార్యకర్తలేనన్నారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డికి తమకష్టాలు చెప్పుకోడానికి వచ్చిన టీచర్లపై గొడ్డలి పార్టీ గూండాలు దాడులు చేయడం బాధాకరమన్నారు. గురు బ్రహ్మ, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః అంటూ గురువులను దైవంగా కొలిచే సమాజం మనదన్నారు. అటువంటి దైవాలపై జగన్ గ్యాంగ్ దాడులు చేయడం క్షమించరాని నేరమన్నారు. 2025 మెగా డీఎస్సీలో టీచర్ అభ్యర్థులు రేయింబవళ్లు కష్టపడి లక్ష్యం సాధించారన్నారు. అటువారి కష్టాన్ని తక్కువ చేసి చూపుతూ, ఆత్మగౌరవం కించపరిచేలా నీలి మీడియాలో విషపు రాతలు రాస్తూ గొడ్డలి పార్టీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంత్రి నారా లోకేశ్ ఎంతో పారదర్శకంగా, అక్రమాలకు తావులేకుంటే 2025 మెగా డీఎస్సీ నిర్వహించారని మంత్రి సవిత కొనియాడారు. స్పోర్ట్స్ కోటాలోగాని, మరేకోటాలోగాని ఎటువంటి అక్రమాలు జరగలేదని హైకోర్టు, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారన్నారు. కనీస అవగాహన కూడా లేకుండా జగన్, గొడ్డలి పార్టీ నాయకులు మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. జగన్ కు దమ్ము, ధైర్యం ఉంటే మెగా డీఎస్సీపైనా, ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్ 1 మూల్యాంకనంపైనా చర్చకు రావాలని మంత్రి సవిత సవాల్ విసిరారు.గ్రూప్ 1 పోస్టుల మూల్యాంకనం ఎల్.కె.జి. విద్యార్థుల మాదిరిగా మూడు పర్యాయాలు దిద్దారని సిట్ నివేదికలో బయటపడిందని మంత్రి సవిత తెలిపారు. లిక్కర్ కుంభకోణంలో జగన్ సహా వైసీపీ పెద్ద తలకాయలు అరెస్టయ్యే అవకాశముందనే వార్తలు మీడియాలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ వార్తల నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి విజయవాడలోని శాప్ కార్యాలయంపైనా, ఉపాధ్యాయులపైనా గొడ్డలి పార్టీ గూండాలు దాడులకు తెగబడ్డారన్నారు. సమాజాన్ని ఉన్నతమార్గంలో పయనించేలా కృషి చేస్తున్న ఉపాధ్యాయులపై జగన్ పార్టీ నాయకులు, గూండాలు దాడులు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా దాడులకు తెగబడితే చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని మంత్రి సవిత హెచ్చరించారు.జగన్ రాజకీయ కుట్రలు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పావులు కావొద్దని మంత్రి సవిత హితవు పలికారు. జగన్ కు ప్రజాస్వామ్యంపైనా, చట్టాలపైనా గౌరవం లేదని, ఆయన మాటలు నమ్మి దాడులు చేస్తే జైలు పాలవ్వడం ఖాయమని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, రాష్ట్రంలో అల్లకల్లోలాలు సృష్టిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టంచేశారు. అయిదేళ్ల జగన్ అసమర్థ పాలన, రెండేళ్ల సీఎం చంద్రబాబు పాలన బేరీజు వేసుకుకోవాలన్నారు. జగన్ ను నమ్ముకుంటే జైలేనని, చంద్రబాబును నమ్మకుంటే అభివృద్ధి అని వైసీపీ నాయకులకు మంత్రి సవిత హితవు పలికారు.

### 'దబాయించడం, బుకాయించడమే కాదు... ఎదురుదాడికి దిగుతున్నారు.

వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వ ఆటలు సాగవని. న్యాయ స్థానాల ద్వారా పోరాడుతామని ఆయన హెచ్చరించారు. అసలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నించారాయన.సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి మాట్లాడిన సజ్జల.. డీఎస్సీ అక్రమాలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి శ్రేణులు దాడులకు తెగబడుతున్న ఘటనలను ఆయన తీవ్రంగా ఖండించారు. 'దబాయించడం, బుకాయించడమే కాదు... ఎదురుదాడికి దిగుతున్నారు. శాంతియుతంగా ధర్నాలు చేస్తున్న వారిపై దాడులకు తెగబడుతున్నారు. నియంతల పాలన సమయంలో కూడా ఇలా జరగలేదు. అబద్ధం, దుర్మార్గం, బరితెగింపు, క్రూరత్వం కలిపితే అది వెన్నుపోట్ల పార్టీ. చంద్రబాబుకు కొడుకు తోడయ్యాక ఈ పరిస్థితులు మరింత దిగజారాయి.డీఎస్సీ అభ్యర్థి కోర్టుకు వెళితే అసలు బండారం బయటపడింది. డీఎస్సీలో మోసపోయిన అభ్యర్థులకు న్యాయం చేయకపోతే ఎలా? డీఎస్సీలో ఎన్ని కుంభకోణాలు జరిగాయో అన్నీ ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. టెట్ పాస్ కానీ వారికి ఉద్యోగాలు ఇచ్చారు. సంబంధం లేని సబ్జెక్ట్‌లలోనూ ఉద్యోగాలు ఇచ్చారు. చివరికి పరీక్షా పేపర్లు కూడా అమ్ముకున్నారనే వార్తలు వచ్చాయి. మాపై దాడులు చేస్తూనే.. మరోవైపు ఉపాధ్యాయులపై వైఎస్సార్‌సీపీ నేతలే దాడులు చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. తప్పు చేసి కూడా దబాయించాలని చూస్తున్నారు.

## 'సర్' ప్రక్రియ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారు

ఘాటుగా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న వైఖరి 'ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు, తప్పులు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో సరిదిద్దాలే తప్ప, దేశ మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి అత్యున్నత ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేయడం ఏ రకమైన ప్రక్షాళన అని ఆయన నిలదీశారు.పేర్లలో చిన్నపాటి స్పెల్లింగ్ పొరపాట్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడం వంటి అత్యంత సహజమైన అంశాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించడం, తాతముత్తాతల పుట్టిన తేదీలను వెతకాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం విడ్డూరంగా ఉందని నారాయణ మండిపడ్డారు. దేశంలో ఉన్న కోట్లాది మంది ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, రాజ్యాంగబద్ధమైన నిష్పక్షపాతంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయం నడిపించే ఒక 'సురభి నాటకం'లో స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ అపవిత్రమైన పావుగా మారకూడదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం

ఆర్థిక వనరుల సమీకరణ'సదస్సులో తెలంగాణ నుంచి భట్టి విక్రమార్కతోపాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, ఇతర కీలక ప్రాజెక్టుల కోసం ఇకపై ప్రైవేటు పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్‌ను భారీగా సమీకరించే నమూనా వైపు రాష్ట్రం దృష్టి సారిస్తోందని చెప్పారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్?కను తగ్గించడానికి, వయబిలిటీ గ్యాప్ పూడ్చడానికి ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగిస్తామన్నారు. ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యాలు (పీపీపీ), గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ మార్గాలను మరింత బలోపేతం చేస్తామని భట్టి వివరించారు.

వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం..

దేశాన్ని 2047 నాటికి అభివద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగుతున్న వికసిత్ భారత్ ప్రయాణంలో తెలంగాణ కీలక భూమిక పోషిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 2025--26 నాటికి తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 17.82 లక్షల కోట్లకు చేరిందన్నారు. ప్రస్తుత ధరల ప్రకారం ఇది 10.7 శాతం వృద్ధి అని.. స్థిర ధరల ప్రకారం వాస్తవ జీఎస్‌డీపీ వృద్ధి 8.5 శాతంగా అంచనా వేశామని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ సగటు రూ. 2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండి రూ. 4,18,931కి చేరిందని భట్టి గుర్తుచేశారు. ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వివరించారు. రాష్ట్ర సమతుల్య అభివృద్ధి కోసమే క్యూర్, ప్యూర్, రేర్ అనే ప్రత్యేక నమూనాను అమలు చేస్తున్నట్లు భట్టి వివరించారు. అలాగే దేశంలోనే తొలి నెట్--జీరో, ఏఐ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా 30 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని భట్టి వెల్లడించారు.

యువతే తెలంగాణ అసలైన బలం...

రాష్ట్ర యువతే తెలంగాణ అసలైన బలమని భట్టి పేర్కొన్నారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించేందుకు అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. సామాజిక భద్రత, మెరుగైన వైద్యం, మహిళా సాధికారతతో కూడిన సమ్మిళిత అభివృద్ధే రాష్ట్ర విధానమని భట్టి వివరించారు. వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని చెప్పారు. శనివారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 'వికసిత్ భారత్ వైపు భారతదేశ ప్రయాణానికి ఆర్థిక సహకారం' సదస్సులో భట్టి మాట్లాడారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు.తెలంగాణ రాష్ట్రం కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో పాల్గొంటోందని తెలిపారు. తెలంగాణ బలమైన ఆర్థిక పునాదులతో తదుపరి దశ వృద్ధికి సిద్ధంగా ఉందని చెప్పారు. 2025-26లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ప్రస్తుత ధరల ప్రకారం 10.7 శాతం వృద్ధి నమోదైందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటు రూ.2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలని వివరించారు. సేవల రంగం 13.5 శాతం, ద్వితీయ రంగం 9.4 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు. ఇదే వృద్ధి పథంలో కొనసాగితే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ఉందని..అయితే రాష్ట్ర ప్రభుత్వం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించిందని వెల్లడించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలంటే మౌలిక వసతులకు నిధులు సమకూర్చే విధానంలో మార్పు అవసరమని భట్టి పేర్కొన్నారు. అభివృద్ధి ఒకే నగరానికి పరిమితం కాకూడదన్న లక్ష్యంతో తెలంగాణ 'క్యూర్, ప్యూర్, రేర్' పేరుతో మూడు పరస్పర అనుసంధానిత ఆర్థిక ప్రాంతాలతో ప్రత్యేక అభివృద్ధి నమూనాను రూపొందించిందని పేర్కొన్నారు. భవిష్యత్ నగరాలకు నమూనాగా 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు.

# నా పాలనలో ఏ డీఎస్సీలోనూ అవకతవకలు జరగలేదు

ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. సీఎం పదవిలో తనకు ఇది 17వ సంవత్సరమని, తన హయాంలో నిర్వహించిన ఏ డీఎస్సీలోనూ ఎలాంటి అవకతవ కలకు చోటులేదన్నారు. తగిన ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని, అంత ధైర్యం లేకపోతే కోర్టుకు వెళ్లాలని సవాలు విసిరారు. చట్టసభకు వస్తే సాక్ష్యాధారాలతో వారి బండారాన్ని బయటపెడతామని హెచ్చరించారు.

దమ్ముంటే అసెంబ్లీకి రండి..

వైసీపీ హయాంలో జరిగిన జే-బ్రాండ్స్ మద్యం అక్రమాలు, ఏపీపీఎస్సీ భర్తీల్లో జరిగిన ఘోరాలపై సమాధానం చెప్పే ధైర్యం వారికి ఉందా అని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో తీసుకెళ్తుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. సమాజ నికి మార్గదర్శకులుగా నిలిచే ఉపాధ్యాయులపై వైసీపీ రౌడీలు దాడులకు తెగబడటం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న ఆ పార్టీ అసలు "గొడ్డలి పార్టీ" అని, ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు వారికి లేదని దుయ్యబట్టారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీని కేవలం 11 సీట్లకే పరిమితం చేసి, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా గట్టి బుద్ధి చెప్పారని చంద్రబాబు గుర్తుచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా వారికి ఒక్క సీటు కూడా రాకుండా ప్రజలు మళ్లీ తగిన తీర్పు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం అవినీతికి ఏమాత్రం చోటు ఉండదని, విమర్శలు మాని దమ్ముంటే సభకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష నాయకులకు స్పష్టమైన సవాలు విసిరారు.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ దాడులపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కుప్పం బహిరంగ సభలో స్పందిస్తూ.. టీచర్లపై వైసీపీ నేతల దాడిని తప్పుపట్టారు. డీఎస్సీ ఉద్యోగాలు తమ కష్టార్జితమని టీచర్లంతా నినదిస్తున్నారని.. ఫేక్ పార్టీ అందరినీ ఫేక్ అంటే సహించేది లేదని విజయవాడలో స్పోర్ట్స్ టీచర్లు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. ఇవాళ విజయవాడలో గురువులపై రౌడీలు దాడి చేస్తున్నారని మండిపడ్డారు. టీచర్లపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని... చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'సీబీఎన్ జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్లలో అవినీతే జరగలేదు.. నా హయాంలో ఎప్పుడూ పేపర్ లీక్ కాలేదు. సీబీఎన్ పాలనలో టీచర్ల రిక్రూట్మెంట్, డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం... ఇదీ మన ట్రాక్ రికార్డ్' అని వెల్లడించారు.నియామకాలు జరిగిన ఏడాది తర్వాత ఇప్పుడు లేనిపోని దుష్ప్రచారం చేస్తూ బురద జల్లుతున్నారని సీఎం మండిపడ్డారు. కర్నూలు కొండారెడ్డి బురుజు, విజయవాడలో అంబేద్కర్ విగ్రహం, విశాఖలో సముద్రం ఒడ్డున దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ టీచర్లు గర్జించారన్నారు. ఫేక్ పేపర్‌కు చెందిన రిపోర్టర్ ఓ ఉపాధ్యాయుడిపై దాడి చేశారంటే... వైసీపీ మూకలు ఎంతకు బరితెగించాయో అర్థం చేసుకోవాలని అన్నారు. ఇలాంటి వాళ్లను ఇంకా ఉపేక్షించాలా..? వీరిలాగే కొనసాగితే ఆస్తులకు ఆడబిడ్డలకు రక్షణ ఉంటుందా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే సాక్ష్యాధారాలతో చూపించి వారి నోళ్లు మూయిస్తామని తెలిపారు. చట్టబద్ధంగా జరిగిన ప్రక్రియపై అవసరమైతే కోర్టులకు వెళ్లొచ్చని... కానీ దాడులేంటీ...? ఉపాధ్యాయులపై రౌడీలను ఎగదొయడమేంటీ అంటూ ఫైర్ అయ్యారు.2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని... రాష్ట్రానికి అది మామూలు నష్టం కాదని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. నాటి పాలనలో పాలకులే రౌడీయిజం చేశారని.. దారుణాలకు పాల్పడ్డారని వ్యాఖ్యానించారు. కుప్పం వస్తే తనను కూడా ఇబ్బందులు పెట్టారని.. దౌర్జన్యాలకు దిగారని మండిపడ్డారు. ఓడిపోయిన తర్వాత కూడా చంపడానికైనా చావడానికైనా సిద్ధమంటూ రౌడీయిజం చేస్తున్నారని అన్నారు. రౌడీయిజం చేసే వారి తోక కత్తిరిస్తామని... రౌడీలను విధ్వంసకారులను తరిమి కొట్టే సత్తా కుప్పానికి ఉందని హెచ్చరించారు. ఫ్లెక్సీలకు పొట్టేళ్లు బలి ఇచ్చి రక్తాభిషేకం చేస్తున్న వారిని సైకోలు అనాలా..? మానసిక రోగులు అనాలా..? అంటూ వ్యాఖ్యానించారు. తిరుమల పవిత్ర లడ్డూను కూడా కల్తీ చేశారని మండిపడ్డారు. ప్రతి ఎన్నికలోనూ సైకిల్ గుర్తుకు మాత్రమే ఓటేసి మద్దతిచ్చిన నియోజకవర్గాలు ఒకటి కుప్పం, రెండోది హిందూపూర్ అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని జూనియర్ డాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఈ మేరకు జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్ పెంచుతూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. **MBBS, BDS**లకు 10 శాతం, పీజీలకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీకి 3.5 శాతం స్టైఫండ్ పెంచింది. స్టైఫండ్ పెంపుతో ప్రభుత్వానికి రూ.34.08 కోట్ల అదనపు ఖర్చు కానుంది. ఏపీ సర్కార్ నిర్ణయంపై జూనియర్ డాక్టర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, దివంగత మాజీ ఎంపీ నరమల్లి శివప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. తన చిన్ననాటి మిత్రుడిని స్మరించుకుంటూ చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ఒక సందేశాన్ని పంచుకున్నారు.శివప్రసాద్ కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా, మంత్రిగా, ఎంపీగా ప్రజలకు విశేష సేవలు అందించారని చంద్రబాబు కొనియాడారు. ప్రజాసేవతో పాటు సినిమా, నాటక రంగాల్లో నటుడిగా, దర్శకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారని గుర్తుచేసుకున్నారు"ప్రజాసేవకు అంకితమైన మిత్రుడు శివప్రసాద్ జ్ఞాపకాలు ఎప్పటికీ నా మదిలో నిలిచి ఉంటాయి" అని చంద్రబాబు పేర్కొన్నారు. సమాజం కోసం శివప్రసాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి తన సందేశంలో వెల్లడించారు.

# దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయి

పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు.తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు.రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు.టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.విజయవాడలో డీఎస్సీ స్పోర్ట్ కోటా ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడి చేయడంపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. గురువులపై దాడి చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. గురువులపై దాడి చేసిన క్రిమినల్ గ్యాంగ్‌లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. వాళ్ల భరతం పడతామని వార్నింగ్ ఇచ్చారు. అందరూ దైవంలా భావించే గురువులను వైన్ షాపులకు కాపలా పెట్టిన జగన్.. ఉపాధ్యాయులను గౌరవిస్తారని అనుకోవడం భ్రమ అని అన్నారు. అత్యుత్తమ ఆటతీరుతో రాష్ట్రం, దేశ సత్తాను ప్రపంచానికి చాటిన క్రీడాకారులను స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు అంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని వ్యాఖ్యానించారు.జగన్ ఫేక్ ముఠా తప్పుడు నిందలతో అవమానాలు పాలైన స్పోర్ట్స్ కోటా డీఎస్సీ 2025 టీచర్లు తమకు న్యాయం చేయాలంటూ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని మంత్రి తెలిపారు. క్రీడలతో దేశ పతాకాన్ని రెపరెపలాడించి, ప్రతిభతో టీచర్ ఉద్యోగం సాధించిన స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ ఫ్యాక్షన్ ముఠా శాప్ కార్యాలయం వద్ద దాడికి దిగిందని మండిపడ్డారు. రౌడీ షీటర్లు, గంజాయి- బ్లేడ్ బ్యాచులను టీచర్లపైకి ఉసిగొల్పడం జగన్ నేర మనస్తత్వాన్ని బయటపెట్టిందని విమర్శించారు. పూజించాల్సిన గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేసిన జగన్ క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలన్నారు. వైసీపీ ప్రేరేపిత రౌడీ షీటర్లు, గంజాయి-బ్లేడ్ బ్యాచుల పనిపడతామంటూ ఎక్స్‌లో లోకేశ్ పోస్ట్ చేశారు.గతంలో బీఆర్ఎస్, బిజెపి దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ప్రకారం, స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నందుకు దానం నాగేందర్‌ను 2024 ఏప్రిల్ 23వ తేదీ నుండి అమలులోకి వచ్చేలా ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు హైకోర్టు తీర్పు ఇచ్చింది. పిటిషన్లను తిరస్కరిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం చట్టబద్ధమైనది కాదని కోర్టు స్పష్టం చేసింది.పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేలపై కూడా త్వరలోనే ఇలాంటి నిర్ణయాలే వెలువడతాయని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ

అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు.గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫక్రుద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు.ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునికీకరణ

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (ర్రావీఖ్) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.సీఎం చంద్రబాబు.. వచ్చే పరిస్థితిని ఎదుర్కోవడంలో మాత్రం ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదంటూ ఆక్షేపించారు. వర్షపాతం లోటు స్పష్టంగా కనిపిస్తున్నా డ్రామాలు ఆడారని ధ్వజమెత్తారు. స్విచ్‌లు నొక్కడం, లాకులు ఎత్తడం, ఫొటోలకు పోజులివ్వడం మాత్రమే చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం మాటలు నమ్మి సాగులోకి దిగిన రైతులు ఇప్పుడు తీవ్ర కరువు పరిస్థితుల్లో నిండా మునిగారని, ప్రతి ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పుణ్యాన రైతులకు అన్నీ కష్టాలేనని.. ఉచిత పంటల బీమా రక్షణ లేకుండా పోయిందని నిప్పులు చెరిగారు. శ్రీశైలం నుంచి రాయలసీమకు సకాలంలో నీళ్లు ఇవ్వలేదని.. విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని వదిలేశారని.. పులిచింతల ఎగువ, దిగువన తెలంగాణ ఎడాపెడా లిఫ్ట్‌ల నిర్మాణం చేపట్టినా చంద్రబాబు నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్, జూలై, ఆగస్టులో వరుసగా మూడు నెలలు వర్షపాతం లోటు స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వం స్పందించ లేదంటూ వైఎస్ జగన్ తప్పుబట్టారు. కరువు మండలాలు ఇంకా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. కర్ణాటక చాలా ముందుగానే ఆ పని చేసిందని గుర్తు చేశారు. కరువు ముంచుకొస్తున్నా ప్రత్యామ్నాయ విత్తనాలు సిద్ధం చేయలేదని, పశుగ్రాసాన్ని జిల్లాలకు పంపలేదని, కనీసం ఉపాధి హామీ అదనపు పనిదినాలు కూడా కోరలేదంటూ దుయ్యబట్టారు.

# జూరాల ఆయకట్టు పంటలను కాపాడాలి

సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ సర్కారు కుట్ర చేస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో మండిపడ్డారు.మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను అక్రమంగా నిర్బంధిం చడం రేవంత్ రాక్షస మనస్తత్వానికి నిదర్శన మన్నారు. తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే జిల్లాలోని అనేక మండలాల్లో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలకు చీకటి ఆదేశాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూరాలలో తొమ్మిది టీఎంసీల నీటి లభ్యత ఉన్నా విడుదల చేయకుండా కుంటిసాకులతో రేవంత్ సర్కారు పంటల ఉసురు తీస్తోందన్నారు. తమ పంటలను కాపాడుకునే తపనతో గుండెపగిలిన రైతులు జూరాల గేట్లు ఎత్తే ప్రయత్నం చేస్తే వారిపై అక్రమ కేసులు బనాయించిన ప్రభుత్వం అన్నదాతలను అన్ని విధాలా అరిగోస పెడుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణ గడ్డపై ఉన్న జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోకి రైతులు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి వందలాదిమంది పోలీసులను మోహరించడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య అని అన్నారు. తాగునీటికి కేవలం రెండు టీఎంసీలు సరిపోతాయని తెలిసినా తొమ్మిది టీఎంసీలు ఉన్న జూరాల నుంచి చుక్క నీరు విడుదల చేయకుండా ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులను సంక్షోభంలోకి నెట్టడం క్షమించరాని పాపం అని అన్నారు. అరెస్టు చేసిన తమ నేతలను విడుదల చేయడంతోపాటు జూరాల ఆయకట్టు రైతులకు వెంటనే నీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ఈ కాంగ్రెస్ సర్కారు కుప్పకూలడం ఖాయం అని కేటీఆర్ హెచ్చరించారు.రైతుల పక్షాన పోరాడుతున్న తమ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఇతర నాయకులను అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గం అని శాసన సభలో బీఆర్ఎస్ ఉపనాయకుడు టి.హరీష్‌రావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాలను శ్రీశైలం నుండి 738 కి.మీ దూరంలో ఉన్న పెన్నా బేసిన్‌లోని కుప్పం వరకు తరలిస్తుంటే పక్కనే ఉన్న పాలమూరుకు మాత్రం ఎందుకు తరలించడం లేదు అని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పాలనా వైఫల్యం కాదా.. పాలకుల చేతగానితనం కాదా.. అని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులో భాగంగా నార్లపూర్, ఏదుల, కరివెన, వట్టెం కలిపి మొత్తం 50 టీఎంసీల సామర్థ్యంతో జలాశయాలను కేసీఆర్ నిర్మిస్తే వాటిని నీళ్లతో నింపే సోయి కూడా మీకు లేదా అని ఆయన ప్రశ్నించారు. గత రెండున్నరేళ్లు కృష్ణానదిలో పుష్కలంగా నీళ్లు పారినా ఎందుకు మోటర్లను నడపలేదు.. శ్రీశైలం నిండు కుండలా ఉన్నా రైతులకు నీళ్లు ఎత్తిపోసే ఆలోచన ఎందుకు చేయలేదు.

## పెద్దవడుగూరును కరువు మండలంగా ప్రకటించాలి

**బీజేపీ నాయకులు డిమాండ్**



పెద్దవడుగూరు సెప్టెంబర్ 22 అనంతపురం జిల్లా రిపోర్టర్ బందారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించడంతో పాటు మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ బాత్రూమ్‌లు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు దేవన రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే వివిధ గ్రామాల నుండి బ్యాంకులు, బస్టాండ్, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రాధాన్యత క్రమంలో పబ్లిక్ బాత్రూమ్‌లు నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌ఛార్జ్ తెగదొడి తిమ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జి. సుంకిరెడ్డి, విద్యుత్ జిల్లా మోర్చా అధ్యక్షులు ఎం. రామాంజనేయులు, కిసాన్ మోర్చా అధ్యక్షులు బి. వీరారెడ్డి, నాయకులు అనంతరామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, శేషనందరెడ్డి, వెంకటేశ్వర్లు, పూల కృష్ణమూర్తి, సురేష్, వెంకటరామిరెడ్డి, శివారెడ్డి, అజయ్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## తల్లి, బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి
## ఐసిడిఎస్ ఇన్‌ఛార్జ్ సిడిపిఓ విజయ్ కుమారి



యాడికి సెప్టెంబర్ 22 అనంతపురం జిల్లా రిపోర్టర్ బందారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : తల్లి, బిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ధ్యేయమని తాడిపత్రి ఐసిడిఎస్ ప్రాజెక్టు ఇన్చార్జ్ సిడిపిఓ విజయ్ కుమారి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పుప్పాల తాండాలో 9వ జాతీయ పోషణ్-2026 మాసోత్సవ ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిడిపిఓ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు 'పుష్టిగా తినాలి-ఆరోగ్యంగా ఎదగాలి' అనే సూత్రాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఐసిడిఎస్ అందిస్తున్న పోషకాహార ప్రయోజనాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 9 నుంచి అక్టోబర్ 8 వరకు 'మన అంగన్వాడీ - మన బాధ్యత' అనే ఇతివృత్తంతో పోషణ్ మాసోత్సవాలు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాల సంజీవిని కిట్ (టేక్ హోమ్ రేషన్) ద్వారా లభించే సరుకులతో పోషక విలువలు దెబ్బతినకుండా రకరకాల వంటకాలు ఎలా తయారు చేయాలో స్వయంగా ప్రదర్శించి చూపించారు. రోగనిరోధక శక్తిని పెంచే పప్పు ధాన్యాలు, ఆకుకూరలు, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన బాల్యానికి, ఉజ్వల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ బడులే పునాది అని స్పష్టం చేశారు. అనంతరం గర్భిణులకు బాలామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ ప్రాజెక్టు అధికారి (ప్రచార విభాగం) ఏపీఆర్వో ఫక్రుద్దీన్, స్థానిక నాయకులు జయరాం నాయక్, సూపర్‌వైజర్లు శంషాద్ బేగం, నాగేశ్వరి, వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు నాగలక్ష్మి, ప్రమీల, మల్లేశ్వరి, రుక్మిణి, వరలక్ష్మి, ఎంఎల్ హెచ్‌వి సునీత, ఆశా వర్కర్లు మరియు తాండా వాసులు పాల్గొన్నారు.

## 25వ వార్డులో ఇంటింటికీ టీడీపీ
## ప్రజల సమస్యలు తెలుసుకున్న టీడీపీ శ్రేణులు



మాచర్ల, సెప్టెంబర్ 22:ఆర్ సి ఇన్చార్జ్ నేటి శుభోదయ : మాచర్ల పట్టణంలోని 25వ వార్డులో కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న "ఇంటింటికీ--తెలుగుదేశం" కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. టీడీపీ సీనియర్ నాయకులు, మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, 25వ వార్డు ఇన్‌చార్జి దొడ్డ చందు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ప్రజలతో మమేకమై, ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ సాగిన కార్యక్రమానికి స్థానికుల నుంచి స్పందన లభించింది. కార్యక్రమంలో దొడ్డా వెంకటేష్, నందంగారి సురేష్, షైక్ బాధన్ భాయ్, బొజ్జ శ్రీను, చిరుమామిళ్ల శేఖర్, షైక్ బాషా, దొడ్డా కృష్ణ, దొడ్డా నరసింహారావు, కొమ్ము ప్రసాద్, భాగం శ్రీను, షైక్ హుస్సేన్, బుట్టి మారుతి కిరణ్, మందుల గణేష్, ఇప్పల మహేష్, దొడ్డా పోలయ్య, జనసేన లక్ష్మణ్, జనసేన వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## 'పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత..!'

**– రూ.300 కోట్ల హెచ్.ఏ.ఎం. పనులతో రాజమహేంద్రవరం మరింత అభివృద్ధి**

**– 'రుడా' చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి**



కోరుకొండ, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రాజమహేంద్రవరం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో సుమారు రూ.300 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు.నగరంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు, పార్కులు, క్రీడా మైదానాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. ముఖ్యంగా క్వారీ ప్రాంతంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సుమారు రూ.100 కోట్లతో పనులు చేపట్టడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు.గత రెండేళ్లలో రాజమహేంద్రవరం నగరంలో సుమారు రూ.505 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా నగర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమవుతోందన్నారు.నగరాన్ని మరింత సుందరంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు పార్కుల అభివృద్ధి, రోడ్ల నిర్మాణం, క్రీడా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారని 'బొడ్డు' తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాజమహేంద్రవరం నగర అభివృద్ధి మరింత వేగంగా కొనసాగుతుందని బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు.ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ శ్రీ సరస్వతి విద్యానికేతాన్లో శాస్త్రోక్తంగా శ్రీ మహా గణపతి హోమం ఘనంగా...!!



కోరుకొండ, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె)–:తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండల కేంద్రంలోని సరస్వతి విధ్యానికేతాన్ ఆవరణలో గణపతి నవరాత్రుల మహోత్సవాలు సందర్భంగా సోమవారం గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధినేత వెనకటి గంగాధర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక రాజకీయ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రజలందరూ.... ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ గణపతి హోమం నిర్వహించినట్లు తెలిపారు. స్కూల్ ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి బుధవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



## వినాయక పూజ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నేత కర్నాటి కృష్ణ



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల వన్ టౌన్ ఏరియాలోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న ఖమ్మం నగర మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కర్నాటి క్రిష్ణ , డిప్యూటి ఫ్లోర్ లీడర్ ఎస్ కే మగ్బుల్. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులను కర్నాటి క్రిష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినం ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధులు అందించాలని విఘ్నేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సుడా చైర్మెన్ బచ్చు విజయ్ కుమార్ , మాజీ కార్పొరేటర్స్ పగడాల శ్రీవిద్య , ప్రశాంత లక్ష్మి, వన్ టౌన్ ఏరియా నాయకులు ఎస్ కే తాజ్ ద్దీన్ ' తోడేటి లింగరాజు యాదవ్, మాటేటి కిరణ్, కంచర్ల దయకర్, సాయికిరణ్, మాజీ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ లక్ష్మీ ప్రసన్న , సయ్యద్ సాజీద్ , సాయిక్రిష్ణ, ఎం డి షారుక్ , సంపటి గణేష్ , నల్లగట్ల పుల్లయ్య , చింతల సాంబ , సంపటి గౌతమ్ , నయియ్, తజముల్ , గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు తదితరులు తదితరులు పాల్గొన్నారు

## వెస్ట్ గానుగగూడెం, వెలమ వీధి, ఆర్‌అండ్ఆర్ కాలనీ,శ్రీరంగపట్నం,తంటికొండ మండపాలకు 'రామసేన' అధ్యక్షుడు 'కంబాల' రూ.35 వేల ఆర్థిక సహాయం..!!



కోరుకొండ, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె):గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాలకుబి విశ్వహిందూ ధర్మపరిరక్షణ, రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందించారు. వెస్ట్ గానుగగూడెం, రామాలయం వీధి, వెలమ వీధి, ఆర్‌అండ్ఆర్ కాలనీ, శ్రీరంగపట్నంలోని మూడు గణపతి మండపాలతో పాటు తంటికొండ గ్రామంలోని గణపతి మండపాలకు కలిపి రూ.35 వేల విరాళాన్ని కంబాల శ్రీనివాసరావు అందించారు. గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం మండపాల నిర్వాహకులకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు.గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు కంబాల శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



## డీజే నిషేధించాలి.పులి శ్రీరాములు డిమాండ్



ఏలూరు, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: వివిధ ఊరేగింపుల్లో, ఉత్సవాలలో వినయోగిస్తున్న డీజే శబ్దాలను నిషేధించాలని కేంద్ర ప్రభుత్వ టిఎసి మాజీ సభ్యులు పులి శ్రీరాములు డిమాండ్ చేశారు.ఆ శబ్దాలు వినే వారికి గుండెపోటు వచ్చే ప్రమాదముందని పులి శ్రీరాములు ఆందోళన వ్యక్తం చేశారు.ఏలూరు విద్యానగర్ లో నివాసముంటున్న హెడ్ కానిస్టేబుల్ ఆదివారం ఏలూరు లో జరిగిన డిజే శబ్దాలతో కూడిన ఊరేగింపులో విధులు నిర్వహించి సోమవారం తెల్లవారుజామున మృతి చెందారని ఆయన ఆరోపించారు. కానిస్టేబుల్ శ్రీనివాసరావు మరణం పట్ల పులి ప్రగాఢ సంతాపం తెలిపారు.డీజే శబ్దాలవలన పలువురు గుండెదడతో పాటుగా ఆందొళనకు గురి ఆవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం డీజే శబ్దాలను నిషేదించాలని,శబ్ద కాలుష్యం నుండి ప్రజలను కాపాదాలని పులి శ్రీరాములు కోరారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి
# రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**రబీకి ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికను సెప్టెంబర్ నెలాఖరులోగా సిద్ధం చేయాలి**

**– అక్టోబర్ నుంచి జూన్ వరకు పనుల సీజన్‌ను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి**

**– ఖమ్మం నగర విద్యుత్ అవసరాలకు పదేళ్ల ప్రణాళిక రూపొందించాలి**

**ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన మంత్రి**

ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఖమ్మం నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని చెరువులను నింపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుగ్గవాగు ఎత్తిపోతల పథకం పనులు చాలా కాలంగా ఆలస్యమవుతున్నాయని, పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. బుగ్గవాగు నీటిని గ్రావిటీ ద్వారా ఏఏ కాలువలకు అందించవచ్చో పరిశీలించి, అవసరమైన అంచనాలను సవరించి సమర్పించాలని ఆదేశించారు. పనుల పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని తెలిపారు. మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు అవసరమైన 10-ఏ మినహాయింపు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించే ధోరణిని మార్చుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా బాధ్యతతో పనిచేయాలని అన్నారు. డ్రైనేజీ డిజైన్లు, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ లేఅవుట్‌ను త్వరగా తుది రూపంలో సిద్ధం చేయాలని, వచ్చే వర్షాకాలం లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగునీరు, త్రాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అన్నారు. గోదావరి జలాలను సక్రమంగా ప్రణాళిక చేసుకుని వినియోగించాలని, ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 15 వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలువలు, షట్టర్లు, నీటి మట్టాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వచ్చే సీజన్ నుంచి అన్ని నిర్వహణ పనులను వేసవిలోనే పూర్తి చేయాలని ఆదేశించారు.త్రాగునీటినీ జాగ్రత్తగా వినియోగించాలని, నీటి విడుదల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని మంత్రి సూచించారు. ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైతే నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.రోడ్లపై ఎలాంటి ఆక్రమణలు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. కేబుల్ బ్రిడ్జి పనులకు మరో నెల రోజుల సమయం మాత్రమే ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేయాలని, నవంబర్‌లో హ్యాండోవర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హ్యామ్ రోడ్లలో ప్రస్తుతం మంజూరైన బలోపేత పనులు అవసరం లేదని, నాలుగు లేన్ల రహదారి విస్తరణను ఇల్లందు వరకు చేపట్టేలా




అవసరమైన అంచనాలను సవరించాలని సూచించారు. మెడికల్ కళాశాల హాస్టల్, అడ్మినిస్ట్రేటివ్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి కేబుల్ బ్రిడ్జితో పాటు ప్రారంభించేలా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.మంజూరైన అన్ని పనులను అక్టోబర్ నుంచి ప్రారంభించేలా సెప్టెంబర్ నెలాఖరులోగా టెండర్లు, ఇతర పత్రాల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు అనుకూలమైన పనుల సీజన్‌ను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని తెలిపారు.వచ్చే రబీ సీజన్‌కు వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటి నుంచే పంటల ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత లేకపోవడం, కాలువల ద్వారా సాగునీటి పరిస్థితి, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ప్రత్యామ్నాయ రబీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులను అనుకూలంగా వినియోగించుకుని ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా పెంచాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులను వెంటనే ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న వారికి తదుపరి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అర్హులైన వారికే ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వెలుగుమట్ల కాలనీలోని అన్ని ఇళ్లను నవంబర్ 21లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, విద్యుత్ లైన్లు, డ్రైనేజీ తదితర అన్ని మౌలిక వసతుల పనులను పూర్తి చేసి కాలనీని ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసేలా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను అనుసంధానం చేయాలని, మున్సిపల్ శాఖతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఖమ్మం నగరానికి వచ్చే పదేళ్లలో అవసరమయ్యే విద్యుత్‌ను అంచనా వేసి సబ్‌స్టేషన్లను ప్రణాళిక చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో విద్యుత్ కేబుళ్లతో పాటు అవసరమైన ఇతర కేబుళ్లను భూగర్భంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారి విస్తరణ, భూగర్భ కేబుళ్లు, తదితర పనులను అన్ని శాఖల సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు.గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు దశల వారీగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి అన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేసి అవసరమైన పనులను చేపట్టాలని, అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో కనీస మౌళిక వసతులు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఖమ్మంలోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వచ్చే జూన్ లోగా పూర్తి చేయాలని, రాష్ట్రంలో తొలి యంగ్ ఇండియా స్కూల్‌గా ఖమ్మం పాఠశాలను ప్రారంభించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఖమ్మంలో షాదీఖానా నిర్మాణానికి అనువైన స్థలాన్ని, హరిత భవన్‌కు అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపాలని రెవెన్యూ అధికారులను మంత్రి ఆదేశించారు. కమ్యూనిటీ అసోసియేషన్లకు భూమి కేటాయింపులను ఒకే ప్రాంతంలో చేపట్టేలా స్థలాన్ని గుర్తించి అవసరమైన కేటాయింపులు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని చెరువులను నింపుతున్నట్లు తెలిపారు. మున్నేరు రక్షణ గోడ మిగిలిన పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.పంచాయతీరాజ్ శాఖ పరిధిలో హ్యామ్ రోడ్లకు సంబంధించి 10 పనులకు రూ.36.60 కోట్ల మంజూరు లభించిందని, టెండర్ ప్రక్రియ పూర్తయిందని, నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలో ఏడు కొత్త సబ్‌స్టేషన్లు ప్రతిపాదించామని, వాటికి అవసరమైన భూములు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు వెల్లడించారు.ఈ సీజన్‌లో జిల్లాలోని 20 మండలాల్లో వర్షపాతం లోటు ఉన్నప్పటికీ గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం కేవలం 7 వేల ఎకరాలు మాత్రమే తగ్గిందని తెలిపారు. పెసర సాగు విస్తీర్ణం పెరిగిందని, ఈ ఏడాది అదనంగా 5 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టినట్లు వివరించారు.ఖమ్మం ఖిల్లా రోప్‌వే దిగువ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో మంజూరైన 137 పనుల్లో 54 పనులు పూర్తయ్యాయని, మరో 54 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నీటి నిల్వ సమస్యలను పరిష్కరించామని, ప్రధాన రహదారులపై యంత్రాలతో స్వీపింగ్ నిర్వహించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు.ఈ సమీక్షలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులపై
# ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి
**: సీపీఎం మండల కమిటీ**



చింతూరు, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు కారణంగా ఏర్పడిన పరిస్థితులను అంచనా వేసి, రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రభావిత మండలాల్లో భాగంగా చింతూరు మండలం లో సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం చింతూరు మండల కమిటి డిమాండ్ చేశారు.మంగళవారం చింతూరులో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో పల్లపు వెంకట్ మాట్లాడుతూ వర్షపాతం లోటు కారణంగా వ్యవసాయం, తాగునీరు, పశువుల మేత తదితర అంశాలపై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన అన్నారు. కరువు పరిస్థితిని కేవలం వర్షపాతం గణాంకాలకే పరిమితం చేయకుండా గ్రామస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి చింతూరు మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతం గా గుర్తించాలని కోరారు.ప్రభుత్వం తక్షణం చేపట్టాల్సిన చర్యలు, వర్షపాతం లోటు ఉన్న మండలం కనుక శాస్త్రీయంగా గుర్తించి కరువు మండలాలం గా ప్రకటించాలి. కరువు ప్రభావిత రైతులకు పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాల రీషెడ్యూల్ వంటి సహాయం అందించాలి. కరువు సమయంలో గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా ప్రారంభించి, పనిదినాలు పెంచాలి. చింతూరు ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతుల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కరువు సహాయక ప్యాకేజీ ప్రకటించాలి.కరువు అనేది కేవలం రైతుల సమస్య కాదని, అది వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, చిన్న రైతులు, పశుపోషకులు, గ్రామీణ పేదల జీవనంపై ప్రభావం చూపుతుందని పల్లపు వెంకట్ పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం ముందస్తు చర్యలకు ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా ప్రత్యేక నిధులు కేటాయించి,చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు సీసం సురేష్, మల్లం సుబ్బమ్మ, పోడియం లక్ష్మణ్, ముట్టుం రాజయ్య మండల కమిటీ సభ్యులు వేక రాజ్ కుమార్, చింతా రాంబాబు, మడకం రమేష్, కారం నాగేష్, కారం సుబ్బారావు, కలుముల మల్లేష్, సోడి దుర్గారావు, మొర్రం పిడగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ రేబిస్ అవగాహనా వారోత్సవాలు



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :::22 నుండి 28 వరకు జరిగే అవగాహన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ ప్రజలకు రేబిస్ వ్యాధి నివారణ, కుక్కలు, ఇతర జంతువుల కాటు వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారని ప్రజలు తప్పక పాటించవలసిన జాగ్రత్తలు, కుక్క లేదా ఇతర జంతువు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు, ప్రవహించే నీటితో కనీసం 15 నిమిషాలు శుభ్రంగా కడగాలి,గాయానికి పసుపు, మిరపపొడి, నూనె, మట్టి వంటి పదార్థాలు రాయకూడదు అని పేర్కొంటూ,జంతువు కరిచిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి అని పేర్కొంటూ ,వైద్యుల సూచన మేరకు రేబిస్ వ్యాక్సిన్ అవసరమైనప్పుడురేబిస్ఇమ్యూనోగ్లోబులిన్ (ఆర్ఐజి) తీసుకోవాలి అని, పెంపుడుకుక్కలకు క్రమంతప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలని, వీధి కుక్కలను రెచ్చగొట్టకుండా, ముఖ్యంగా చిన్నపిల్లలు వాటికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి అని,"రేబిస్‌ను నివారించవచ్చు -- జంతువు కరిచినప్పుడు వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు." అని పేర్కొనడం జరిగింది.

## తెలంగాణలో మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులు

ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: దసరాతో పాటు బతుకమ్మ కూడా వస్తుండటంతో ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చింది. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు దసరా సెలవులు ప్రకటించారు. విద్యాసంస్థలకు చివరి వర్కింగ్ డే అక్టోబర్ 9. ఆ తర్వాత సెలవుల అనంతరం అక్టోబర్ 23వ తేదీనుంచి విద్యాసంస్థలు తిరిగి తెరుకుంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలకు ఈ సెలవులు వర్తిస్తాయి. తప్పనిసరిగా అన్ని సంస్థలు వీటిని అమలు చేయాల్సి ఉంటుంది.

## చారిత్రిక ప్రదేశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి
**- లకారం ట్యాంక్ బండ్ వద్ద 27 న ప్రపంచ పర్యాటక దినోత్సవ ఉత్సవాలు**
**- జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి**




ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: చారిత్రక ప్రదేశాల పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి సూచించారు. మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం వద్ద మంగళవారం పర్యాటక విశిష్టత గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు ను నిర్వహించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యాటక ప్రాంతంగా జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. చారిత్రక, ప్రసిద్ధ పర్యాటక స్థలాలు గురించి విద్యార్థులకు వివరించాలని సూచించారు. చారిత్రక ప్రదేశాల గురించి వారి సంస్కృతిని గురించి వివరించాలని సూచించారు. ఈ నెల 27 న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విజేతలకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్న ప్రసాద వితరణను ప్రారంభించిన పాలెపు విజయ వెంకటరమణ



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ : ఖమ్మం నగరంలో గల లెనిన్ నగర్ లోని డాక్టర్ అసాధారణ హాస్పటల్ దగ్గర శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ నిర్వహించిన అన్న ప్రసాద వితరణను మంగళవారం 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

వారు మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటాననీ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మంత్రి నారా లోకేష్‌కు పుట్టపర్తి విమానాశ్రయంలో టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 22 నేటి శుభోదయ : రాష్ట్ర యువ నేత రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పుట్టపర్తి విమానాశ్రయంలో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నేతృత్వంలో టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.మంగళవారం ఉదయం 8.45 గంటలకు పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే శ పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి సవితమ్మ ,హిందూపురం ఎంపీ పార్ధసారథి ,ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, దగ్గుపాటి వెంకటప్రసాద్ బండారు శ్రావణి ,ఎంపీ, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ,టీడీపీ ప్రజాప్రతినిధులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరస నాయుడు కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు.మంత్రి నారా లోకేష్‌కు స్వాగతం పలికేందుకు పుట్టపర్తి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు తమ్ముళ్లు విమానాశ్రయానికి తరలివచ్చారు. దీంతో సత్యసాయి పుట్టపర్తి విమానాశ్రయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.నారా లోకేష్ రాక సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు.

## మంత్రి నారా లోకేష్‌కు ఘనంగా వీడ్కోలు పలికిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె





అనంత పురం సెప్టెంబర్ 22 నేటి శుభోదయ : ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు రాప్తాడు పర్యటనను ముగించుకుని విజయవాడకు తిరుగు ప్రయాణం కోసం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వీడ్కోలు పలికారు.పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, టీడీపీ జోనల్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మంత్రి సవితమ్మ, హిందూపురం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకట ప్రసాద్, పరిటాల శ్రీరామ్ తదితరులు మంత్రి నారా లోకేష్ బాబుకు వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు మంత్రి నారా లోకేష్ బాబును ఆత్మీయంగా కలిసి వీడ్కోలు తెలిపారు. తనపై పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు చూపిస్తున్న ప్రేమ, అభిమానాన్ని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటానని మంత్రి నారా లోకేష్ బాబు పేర్కొన్నారు.మంత్రి నారా లోకేష్ బాబుకు వీడ్కోలు పలికిన వారిలో ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, రాయల్ మురళి, పుట్టపర్తి యువ నాయకుడు రామారావు, టీడీపీ సీనియర్ నాయకులు రత్నప్ప చౌదరి, సామకోటి ఆదినారాయణ, జయప్రకాష్ ,ఎల్ఐసీ నరసింహులు, వల్లేపు సోమశేఖర్, అంజనప్పతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'కోరుకొండ సొంత ఇళ్ళు లేని నిరుపేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలి'
**- తహశీల్దార్ సునీత కి వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు..**



కోరుకొండ, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన కోరుకొండ గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన సెంటున్నర పట్టాలకు ఆవ భూమిలో చూపించిన స్థలాలు తమకు వద్దని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 3 సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ గ్రామానికి చెందిన నిరుపేదలు మంగళవారం కోరుకొండ ఎం.ఆర్.ఓ సునీత కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుమారు వంద మందికి పైగా బాధితులు ఎం.ఆర్.ఓ. ని కలిసి తమ సమస్యలను వివరించారు. గత 20 సంవత్సరాలుగా ఎన్నోసార్లు అధికారుల చుట్టూ తిరిగామని, ఈ సమస్య పరిష్కారం కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.తమకు కేటాయించిన స్థలాల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను, తమ కుటుంబాల పరిస్థితులను ఎం.ఆర్.ఓ. కి నేరుగా వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 3 సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.బాధితుల నిరుపేద, బడుగు, బలహీన వర్గాల వారి సమస్యను విన్న ఎం.ఆర్.ఓ సునీత ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తప్పకుండా తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.ఈనెల 23, 24వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు అనంతపురం జిల్లా పర్యటన..

## జిల్లాలో పర్యటించనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు..
**-జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 22 నేటి శుభోదయ : ఈనెల 23, 24వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు జిల్లా పర్యటనకు రానున్నారని తెలిపారు.ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఐసిడిఎస్ కేంద్రాలు, కేజీబీవీలు మరియు సిసిఐలను తనిఖీలు చేస్తారు. మధ్యాహ్నం 01:30 గంటల నుంచి 02:00 గంటల వరకు ఎన్జీవోలతో ఇంటరాక్ట్ అవుతారు. మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్లను తనిఖీ చేస్తారు మరియు ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రికి వారు జిల్లాలో బస చేస్తారు.ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు జిల్లాలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు అనంతపురం కలెక్టరేట్ లో ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, జువైనల్ జస్టిస్ బోర్డ్, ఫుడ్ సేఫ్టీ, డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఓ, డిఐఈఓ, పిడి ఎస్ఎస్ఏ, రెవెన్యూ శాఖ, పిడఆర్డీ, ఎంఎయుడి, విద్యాశాఖ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, లేబర్, విలేజ్ / వార్డు చైల్డ్ మ్యారేజ్ ప్రివెన్షన్డ మైనార్టీ కమిటీ, పోలీస్, ఆర్టీవో రూరల్, వాటర్ సప్లై, మున్సిపల్, పంచాయతీరాజ్, తదితర శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం 05:30 గంటలకు అనంతపురం జిల్లా నుంచి బయలుదేరి అన్నమయ్య జిల్లాకు వెళతారు.

## "తాడేపల్లిగూడెం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు"



తాడేపల్లిగూడెం సెప్టెంబరు 22 (నేటి- శుభోదయ) పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. పట్టణంలో మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలను మరింత విస్తరించే దిశగా రూ.33 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం లభించింది.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ అంటే హెచ్ఏఎం విధానం ద్వారా ఈ అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పట్టణంలో మౌలిక వసతులను ఆధునీకరించడం, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పట్టణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం ఈ పనుల ప్రధాన లక్ష్యంగా పేర్కొంటున్నారు.రూ.33 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు పూర్తయితే తాడేపల్లిగూడెం పట్టణంలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. పట్టణ అభివృద్ధిలో భాగంగా అవసరమైన వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజలకు మెరుగైన జీవన సౌకర్యాలు అందించేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడనున్నాయి.హెచ్ఏఎం విధానం ద్వారా చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులు పట్టణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే కాకుండా తాడేపల్లిగూడెం పట్టణాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ఉపయోగపడనున్నాయి.ఇప్పటికే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా రూ.33 కోట్ల విలువైన పనులకు ఆమోదం లభించడం పట్టణ అభివృద్ధిలో మరో కీలక అడుగుగా నిలుస్తోంది.మొత్తంగా చూస్తే తాడేపల్లిగూడెం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.33 కోట్లతో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే ప్రజలకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. పట్టణ అభివృద్ధికి మరింత ఊతమిస్తూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తాడేపల్లిగూడెం అభివృద్ధి పథంలో ముందుకు సాగనుంది.

## గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువ క్రికెటర్లను గుర్తించడమే లక్ష్యం
**అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోండి**
**- చైర్మన్, క్రికెట్ అభివృద్ధి కమిటీ, (ఆర్ డిటి) మచ్చా రామలింగారెడ్డి**



అనంతపురం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లు ఎందరో ఉన్నారనిఅనంతపురం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించి వారిని రాష్ట్రస్థాయి జాతీయస్థాయి క్రికెటర్లను తయారు చేయాలన్న లక్ష్యంతోనే ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపయోగించుకోవాలని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉద్భవిస్తున్న క్రికెట్ ప్రతిభను గుర్తించి, వారిని తీర్చిదిద్ది, వారికి అండగా నిలిచేందుకు 'రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్' (ఆర్ డిటి) చేపట్టిన 'రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్' కార్యక్రమం, అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవడం, క్రమం తప్పకుండా క్రికెట్ సాధన చేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతోందని ఆర్ డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్ డిటి ఏపిసి కృష్ణయ్య, సెలెక్టర్లు డి. ప్రదీప్, ఎస్.జె. షకీర్, ఎస్. ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆర్ డిటి కోఆర్డినేటర్ ప్రవీణ్, కోచ్ జి. హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా, మొత్తం 40 మంది అభ్యర్థులు ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారని మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. అనంతపురంలో శిక్షణా శిబిరాలు, మ్యాచ్‌లను నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రతిభను గుర్తించి వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఆర్ డిటి కట్టుబడి ఉందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ముఖ్య అతిథి సూచించారు. ఆత్మకూరులో సహజసిద్ధమైన క్రీడా ప్రతిభ పుష్కలంగా ఉందని, అథ్లెటిక్స్ ద్వారా చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని ఆత్మకూరు ఆర్ డిటి ఏపిసి కృష్ణయ్య పేర్కొన్నారు. అలాగే అనంతపురంలో క్రీడల అభివృద్ధికి ఆర్ డిటి సమర్థవంతంగా కృషి చేస్తోందని ఆయన అన్నారు. క్రీడల పట్ల తనకు వ్యక్తిగత ఆసక్తి ఉందని మోంచో ఫెర్రర్ పేర్కొంటూ, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో జరుగుతున్న అద్భుతమైన కృషిని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ 'టాలెంట్ హంట్' ఎంతో ప్రయోజనకరమైన కార్యక్రమమని ఆయన అభిప్రాయపడ్డారు.

## "తాడేపల్లిగూడెం అభివృద్ధికి రూ.33 కోట్లు"
**హెచ్ ఏ ఎం తో రహదారులు, డివైడర్లు, లైట్లు, పార్కుల ఆధునీకరణ**
**ఫుడ్‌కోర్టులో స్వచ్ఛతకు పెద్దపీట**
**చీపురు పట్టిన మున్సిపల్ కమిషనర్**
**పరిశుభ్రతే ప్రజారోగ్యానికి రక్ష"**




తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ)::పట్టణ సౌకర్యాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (నావీ) పథకం కింద రూ.33 కోట్లతో రహదారులు, సెంట్రల్ డివైడర్లు, వీధి దీపాలు, మున్సిపల్ పార్కుల ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. బలుసులమ్మ కల్యాణ మండపంలో నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొనగా, కమిషనర్ ఎం. యేసుబాబు అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్నారు.స్వచ్ఛత హి సేవలో భాగంగా కమిషనర్ యేసుబాబు ఆధ్వర్యంలో శుభ్రత : స్వచ్ఛత హి సేవ--2026లో భాగంగా ఎస్‌వీఆర్ విగ్రహం వద్ద మున్సిపల్ ఫుడ్‌కోర్టులో ప్రత్యేక శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ ఎం. యేసుబాబు స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ఫుడ్ స్టాల్స్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆహార విక్రయ ప్రదేశాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని వ్యాపారులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్, సచివాలయ, పారిశుద్ధ్య సిబ్బంది, ఫుడ్‌కోర్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక




ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా ఎల్లంపల్లి యాదగిరి, జిల్లా అధ్యక్షులుగా దొండ దుర్యయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.డి. రఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.కె. జానిమియా, కోశాధికారిగా గుమ్మడవల్లి సంతోష్ కుమార్ ఎన్నికైనట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు రేషన్ డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని రేషన్ డీలర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. డీలర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం సంఘం ఐక్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు."రేషన్ డీలర్ల సంక్షేమమే లక్ష్యంగా డీలర్ల ఐక్యతే బలం" అనే నినాదంతో నూతన కార్యవర్గం ముందుకు సాగాలని డీలర్లు ఆకాంక్షించారు.

# నాటి జీవనశైలే వారిని ఆయుష్మంతులను చేసింది

**- రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాధిక్ ఆలీ**

**- అనారోగ్యాలేకుండా ప్రశాంతంగా దివికేగిన అజ్మీరా సుక్కమ్మకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఘన నివాళులు**



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: నాటి తరం మనుషుల పాటించిన ఆహారపు అలవాట్లు, సహజసిద్ధమైన ఆరోగ్యకరమైన జీవనశైలే వారిని సుదీర్ఘ పాటు ఎలాంటి హానికరమైన జబ్బులు లేకుండా ఆరోగ్యవంతంగా ఉంచాయని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాధిక్ ఆలీ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా, ?ఖమ్మం రూరల్ మండలం, కసనా తండాకు చెందిన వృద్ధురాలు అజ్మీరా సుక్కమ్మ (85) సోమవారం రాత్రి స్వగృహంలో శాంతియుతంగా కన్నుమూశారు. ఆమె మృతిపట్ల పలువురు ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తూ, ఆమె భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సయ్యద్ సాధిక్ ఆలీ మాట్లాడుతూ "ఆధునిక ప్రపంచంలో యంత్రాల జీవితం, కల్తీ ఆహారంతో నేటి తరం చిన్న వయస్సులోనే అనేక రోగాల బారిన పడుతుంటే, నాటి తరం పెద్దలు కష్టపడే తత్వంతో, సాత్వికమైన సహజ ఆహార అలవాట్లతో సుదీర్ఘ పాటు ప్రశాంతమైన, సంతోషకరమైన జీవితాన్ని గడిపారు. జీవితాంతం మంచాన పడకుండా, ఎవరికీ భారం కాకుండా ప్రశాంతంగా తుది శ్వాస విడిచే అదృష్టం సుక్కమ్మకి దక్కడం ఆమె పాటించిన ఆదర్శవంతమైన జీవనవిధానానికే నిదర్శనం. నేటి సమాజానికి, భవిష్యత్తు తరాలకు నాటి మనుషుల ఆహారవ్యవహారాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో ఆవశ్యకం, ఆదర్శనీయం" అని మానవీయ కోణంలో వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. నేటి తరం ఎటువంటి జబ్బులు లేకుండా 85 ఏండ్లు జీవించడం అసాధ్యం అన్నారు. ?అందుకే వారు నేటి తరానికి ఆదర్శం అన్నారు. అమరజీవి సుక్కమ్మకి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారి కుటుంబ సభ్యులకు నాయకులు తమ లోతైన సానుభూతిని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీ భాస్కర్ రావు, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్, జగన్, కిషన్, రాంకోటి, జగన్నాథం, భాషో కిరణ్, భీమా, బాబు మరియు గ్రామ ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ శేషజీవికి కన్నీటి వీడ్కోలు పలికారు.

## మంత్రి నారా లోకేష్ ను కలిసిన చైర్ పర్సన్ తుల్జాపూర్ స్వప్న



అనంత పురం సెప్టెంబర్ 22 నేటి శుభోదయ: రాప్తాడు నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్ ని రాప్తాడు కూడలిలో అపూర్వ స్వాగతం పలికిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలుఅనంతరం రాప్తాడు సర్కిల్ లో స్వర్గీయ నందమూరి తారక రామారావు పరిటాల రవీంద్ర విగ్రహాలను మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్, లింగ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ తుల్జాపూర్ స్వప్న మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి నారా లోకేష్ కు బొకే అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్షర నిధిపై కక్షగట్టిన వైసీపీ గొడ్డలి

**- క్రీడాకారులు, గురువులపై గొడ్డలి పార్టీ గూండాల దాడి అమానుషం**

**- గురువుల తల పగిలి కార్చిన ప్రతీ రక్తబొట్టుకు ఈ సమాజానికి సమాధానం**



అమరావతి, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: 'తమపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని, ఫేక్ ప్రచారాన్ని ఆపాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడానికి శాప్ కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులపై జరిగిన వైసీపీ రౌడీ దౌర్జన్యం కేవలం కొందరిపై జరిగిన దాడి కాదు. అక్షర నిధిపై, సంస్కారంపై జరిగిన గొడ్డలి పెట్టు. "మా మీదే కంప్లైంట్ ఇస్తారా? మిమ్మల్ని రప్పా రప్పా నరికేస్తాం!" అంటూ తొడకొట్టి, మీసం మెలేసి వైసీపీ చిల్లర గంజాయి బ్యాచ్ రౌడీయిజం చేస్తుంటే విద్యావ్యవస్థ నివ్వెరపోయింది.' అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. డీఎస్సీ లీకేజీ డ్రామాల నుండి రోజుకో ఫేక్ ప్రచారంతో సమాజంలో విషం చిమ్మడమే ధ్యేయంగా గొడ్డలి పార్టీ పనిచేస్తుందని ఆఖరికి క్రీడాకారుల చెమట చుక్కలను, టీచర్ల అర్హత సాధించిన అభ్యర్థుల కష్టాన్ని కూడా "ఫేక్" అంటూ అవమానించే స్థాయికి తెగబడటం దారుణమన్నారు. చేతిలో పుస్తకం, మనసులో విద్యార్థుల భవిష్యత్తు తప్ప వేరే ధ్యాస లేని ఉపాధ్యాయులపైకి రాళ్లు రువ్వి, తలలు పగలగొట్టే సంస్కృతి ఏ సమాజానికి సంకేతం? అడ్డుకోబోయిన శాప్ డైరెక్టర్ను సైతం వదలకుండా భౌతిక దాడులకు దిగడం హేయం, అమానుషం. అంతటితో ఆగక, జరిగిన దౌర్జన్యాన్ని కప్పిపుచ్చుకుంటూ, దాడులకు పాల్పడినవారే ఏదో ప్రజాపోరాటం చేస్తున్నట్లు సొంత సాక్షి మీడియాలో తప్పుడు ప్రొపగండా పెట్టించుకోవడం వారి పైశాచికత్వానికి పరాకాష్ట. తప్పు చేసి, తలలు పగలగొట్టి, మళ్లీ దాన్నే నిరసనగా చిత్రీకరించే వైఖరి ప్రజల కళ్లకు గంతలు కట్టడమే. పోలీసుల ఆంక్షలను సైతం లెక్కచేయకుండా, కాజా టోల్గేట్ దాటుకుంటూ విజయవాడకు వచ్చి అలజడి సృష్టించిన ఆ గొడ్డలి పార్టీ మూకల కళ్లలో కనిపించింది ఆవేశం కాదు, అహంకారం. చట్టాన్ని, పోలీసు వ్యవస్థను పక్కనపెట్టి రాళ్లతో దాడికి తెగబడటం శాంతిభద్రతలకే విసిరిన సవాల్. గురువుల రక్తం చిందిన నేల ఎన్నటికీ క్షమించదు. తమ హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉంది. కానీ, ఉపాధ్యాయ పట్ల అక్కసును వెళ్లగక్కేందుకు చూస్తూ ఊరుకోవడానికి ఇది రౌడీల రాజ్యం కాదు. ఉపాధ్యాయులపై దాడులకు తెగబడిన ఆ గూండాలను, వారి వెనుకున్న శక్తులను కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత చట్టానిది. గురువుల తల పగిలి కార్చిన ప్రతీ రక్తబొట్టుకు ఈ సమాజానికి సమాధానం చెప్పాల్సిందే. అందరూ చూడాలని భావించే గురువులపై చైన్ పాపులు కాపాలా పెట్టిన జగన్, ఉపాధ్యాయులను గౌరవిస్తారా అనుకోవడం మన భ్రమ. అత్యుత్తమ ఆటతీరుతో మన రాష్ట్రం, మన దేశం సత్తా ప్రపంచానికి చాటిన క్రీడాకారులను స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు అంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడింది. రౌడీ షీటర్లు, గంజాయి- బ్లేడ్ బ్యాచులను టీచర్లపైకి ఉసిగొల్పడం జగన్ నేర మనస్తత్వాన్ని బయటపెట్టింది. పూజించాల్సిన గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేసిన జగన్ క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదు. టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్కూళ్లు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలి.

## ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**- ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..**




అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 22 : నేటి శుభోదయ: ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాక్ బుక్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ల వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని, ఏ ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, వైఎస్ఆర్సిపి ప్రతినిధి శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ ప్రతినిధి మసూద్ వలి, కాంగ్రెస్ ప్రతినిధి ఇమామ్, సిపిఐ(ఎం) ప్రతినిధి రామాంజనేయులు, బిజెపి శ్యామ్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హి సేవ లో భాగంగా పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



విజయవాడ, సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం పాఠశాల విద్యార్థులకు పబ్లిక్ టాయిలెట్ల వినియోగం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ ఆధ్వర్యంలో బెంజ్ సర్కిల్ వద్ద ఉన్న పింక్ టాయిలెట్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పింక్ టాయిలెట్లో ప్రజలకు అందుబాటులో ఉన్న వివిధ సౌకర్యాలు, సేవలను విద్యార్థులకు వివరించారు. పబ్లిక్ టాయిలెట్లు, కమ్యూనిటీ టాయిలెట్లను అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవడంతో పాటు వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. టాయిలెట్లను ఉపయోగించిన అనంతరం పరిసరాలను అపరిశుభ్రంగా చేయకుండా, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని సూచించారు.పరిశుభ్రమైన మరుగుదొడ్ల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతో ముఖ్యమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు పరిసర ప్రాంత ప్రజలకు కూడా స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రత పట్ల బాధ్యతను మరింత పెంపొందించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ నిరంతరం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు.

# రూ.140 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

**అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌లో**

**భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా అభివృద్ధి పనులకు శ్రీకారం**



విజయవాడ, సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ):- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, మంగళవారం చిత్తూరు జిల్లా కుప్పంలో హైబ్రిడ్ ఆన్ యువర్ టీ మోడల్ ద్వారా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం ముఖ్య అతిథులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోండా ఉమా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.5,500 కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం రాష్ట్ర అభివృద్ధిలో కీలక ముందడుగని అన్నారు.విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో రూ.140 కోట్ల వ్యయంతో అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరమన్నారు. విజయవాడ, గుంటూరు, అమరావతి ప్రాంతాలను సమతుల్యంగా అభివృద్ధి చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టి విజయవాడ నగరాన్ని అంతర్జాతీయ స్థాయి నగరాలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కుప్పంలో ముఖ్యమంత్రి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడంతో పాటు, ఆయా నగరాల్లో స్థానిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. వియంసి కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర పరిధిలో రూ.140 కోట్ల వ్యయంతో అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా నగరంలోని రహదారులు, వీధి దీపాలు, పార్కులు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగర మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, ప్రజలకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన నగర వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనులను చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, జోనల్ కమిషనర్లు శ్రీనివాస్, కె. ప్రభుదాస్, కె. షమ్మీ, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాలకృష్ణమూర్తి, సురేఖ, అసిస్టెంట్ కమిషనర్లు ఏ.యు.బి. శర్మ, హెలెన్ ప్రభావతి తదితరులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దొండా దర్గయ్య, సయ్యద్ రఫీ నియామకం**




ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ :ఖమ్మం జిల్లా రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం జిల్లా సమావేశం మంగళవారం ఖమ్మం నగరంలోని అశోక ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ధరావత్ మోహన్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో భాగంగా ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా కొనిజర్ల మండలానికి చెందిన దొండా దర్గయ్యను, ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ రఫీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఖమ్మం రూరల్ మండలానికి చెందిన యల్లంపల్లి యాదగిరిని, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా షేక్ జానిమియా, కోశాధికారి గా గుమ్మడవెల్లి సంతోష్ కుమార్, గౌరవ సలహాదారుగా కల్లూరు మండలానికి చెందిన రంగారావులను నియమించారు. వీరితోపాటు మరో 34 మందిని కమిటీ లో బాధ్యులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు అభినందించారు. ఖమ్మం జిల్లాలో తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం బలోపేతం చేయడంలో నూతన కమిటీ శక్తి వంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరిగే సభ్యత్వ నమోదులో కీలక భూమికి పోషించి అత్యధికంగా రేషన్ డీలర్లను స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర సంఘం రానున్న రోజుల్లో రేషన్ డీలర్లకు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందని, గౌరవ వేతనంతో పాటు కమిషన్ పెంపు సాధన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం సాగిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాకు చెందిన అన్ని మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, రేషన్ డీలర్ల ఖమ్మం అర్బన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, సాయికుమార్ గోళ్ళ మురళి, ఖాజా మియా, జానీ మియా, గాజుల భద్రయ్య, తోట వెంకన్న, లగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, సత్తార్మియా తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లి క్షిప్ర గణపతి ఆలయంలో రికార్డు స్థాయిలో లడ్డుపాట



తాడేపల్లి సెప్టెంబర్ 21 నేటి శుభోదయ: తాడేపల్లి మహానాడులో స్థానిక క్షిప్ర గణపతి ఆలయంలో జరిగిన లడ్డు పాట ఈ సంవత్సరం రికార్డ్ స్థాయిలో వినాయకుడి లడ్డూ ధర పలికింది ఈ ప్రాంతంలో ఇంతవరకు ఎప్పుడు ఎక్కడ జరిగినటువంటి పోటీ లడ్డూకి ఎక్కడ జరిగింది ఎందుకంటే ఇక్కడ లడ్డు పాడుకున్న వ్యక్తులు సంవత్సరంలోపు అప్పులు బాధలు తీరిపోయి సొంత ఇల్లు కట్టుకుంటారు అనే నానుడి ఉంది అందువల్ల క్షిప్ర గణపతి ఆలయంలో లడ్డుపాటుకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది సోమవారం సాయంత్రం జరిగిన లడ్డుపాటలో పుర ప్రముఖులు అందరూ పాల్గొన్నారు. ఆద్యంతం అత్యంత ఆసక్తికరమైన పాట జరిగింది. ఈ లడ్డు పాట కార్యక్రమంలో చుంచు లక్ష్మీనారాయణ తమ్మిశెట్టి ఆదిశేషు చంద్ర శేషు సుస్మిత రత్తయ్య రాంబాబు ప్రవీణ్ నుసుము పూజిత లింగం ప్రవీణ్ శరత్ నారాయణ మొదలగు వారు పాల్గొన్నారు. అత్యంత ఉత్కంఠ భరితంగా సాగిన ఈ లడ్డు పాటలో 13 కేజీల పెద్ద లడ్డు లింగం ప్రవీణ్ శరత్ 155000 కి పాడుకున్నారు. తర్వాత రెండో లడ్డు నారాయణ లక్ష రూపాయలకు కైవసం చేసుకున్నారు మూడో లడ్డు తమ్మిశెట్టి చంద్ర శేషు లక్ష రూపాయలకి సొంతం చేసుకున్నారు మూడు కేజీల లడ్డు నుసుమ పూజిత 52,000 కి సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్స్ తమ్మిశెట్టి ఆదిశేషు , బండారు వెంకటరమణ నుసుమ చెన్న దిబ్బమడుగు వెంకటనారాయణ ఎర్రగొండ బాలయ్య పెద్ద గోపు రాంప్రసాద్ ఆకుల మురళీకృష్ణ గుంటుపల్లి నరేంద్ర హరికిరణ్ దాసు బాను సత్యనారాయణ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**: డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన**



విజయవాడ, సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. ఆదేశాల మేరకు డీ-లిమిటేషన్ అనంతరం ఏర్పాటైన 86 వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించే ప్రక్రియపై బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బందికి మంగళవారం గాంధీనగర్‌లోని కందుకూరి కళ్యాణ మండపంలో డిప్యూటీ కమిషనర్ జి. సృజన, జోనల్ కమిషనర్ల ఆధ్వర్యం లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన మాట్లాడుతూ, సెప్టెంబర్ 22, 2026 న విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 86 వార్డుల ఓటర్ల డ్రాఫ్ట్ జాబితాను మున్సిపల్ కార్యాలయాలు, ఇతర సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పరిశీలనకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ ఓటర్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అందులో భాగంగా ఈ నెల 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు వార్డు వారీగా, పోలింగ్ స్టేషన్ వారీగా ఇంటింటి సర్వే నిర్వహించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించాల్సి ఉంటుందని జి. సృజన తెలిపారు. ఓటర్ల వివరాలను ఎలక్టోరల్ రోల్స్‌తో సరిపోల్చుకుని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని ఆమె సూచించారు. బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఈ నెల 26 డ్రాఫ్ట్ జాబితాల ప్రచురణ, ఈ నెల 27--28 క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, ఈ నెల 29--30 పరిశీలన, ఫీల్డ్ వెరిఫికేషన్, అభ్యంతరాల పరిష్కారం నిర్వహించి, 1 అక్టోబర్ 2026న తుది జాబితాలను ప్రచురించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు శ్రీనివాస్, ప్రభుదాస్, షమ్మీ, అసిస్టెంట్ కమిషనర్లు ఎ.యు.బి. శర్మ, హెలెన్, ప్రభావతి, స్కూల్ సూపర్‌వైజర్లు , రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ముసుగులో రౌడీయిజాన్ని సహించం, శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ, సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ):- మొగల్రాజపురం లోని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఇంటి వద్ద సోమవారం విజయవాడ బందరు రోడ్డులోని శాప్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్త ఘటనపై తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ విద్యార్థుల ముసుగులో కొంతమంది వ్యక్తులు వచ్చి ఉపాధ్యాయులపై, శాప్ సిబ్బందిపై దాడికి పాల్పడటం దురదృష్టకరం, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ అనుమతి పొందిన ప్రదేశంలో శాంతియుతంగా నిరసన చేపట్టాలని బొండా ఉమా అన్నారు. విజయవాడలో ధర్నా చౌక్ అందుబాటులో ఉండగా, అనుమతి లేకుండా బందరు రోడ్డుపై భారీగా గుమిగూడి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించడం సరికాదన్నారు.కర్రలు, రాళ్లు, కోడిగుడ్లు, వాటర్ బాటిళ్లతో దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని, ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీ, వీడియోలను పూర్తిస్థాయిలో పరిశీలించి బాధ్యులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. శాప్ కార్యాలయం సమీపంలోనే పోలీస్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ఉన్న నేపథ్యంలో ఘటనకు సంబంధించిన దృశ్యాలను పరిశీలించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఉమా కోరారు.నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించినట్లు ముందుగానే ప్రకటించినప్పటికీ పెద్ద సంఖ్యలో వ్యక్తులు అక్కడికి ఎలా చేరుకున్నారో కూడా సమగ్రంగా విచారణ జరపాలని ఉమా అన్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా వ్యవస్థ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు."మా నాయకుడు చంద్రబాబు నాయుడు మమ్మల్ని శాంతియుతంగా ఉండాలని, చట్టాన్ని గౌరవించాలని నడిపిస్తున్నారు. అందుకే మేము సంయమనం పాటిస్తున్నాం. మా సహనానికి కూడా ఒక హద్దు ఉంటుంది. ఆ హద్దు దాటే పరిస్థితులు రాకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలి" అని ఉమా అన్నారు.విజయవాడ నగరం ప్రశాంతంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, నగరంలో రౌడీయిజం, అల్లర్లు చోటుచేసుకుంటే పెట్టుబడులు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశ, విదేశాల్లో పర్యటిస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న సమయంలో ఇలాంటి ఘటనలు రాష్ట్ర ప్రతిష్ఠకు ఇబ్బంది కలిగించేలా ఉండకూడదన్నారు.ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి,శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘటనలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ సీసీ కెమెరాలు, వీడియో ఫుటేజీ ఆధారంగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉమా డిమాండ్ చేశారు. ఇప్పటికే ఘటనపై కేసులు నమోదు చేసినట్లు వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయని, విచారణను నిష్పక్షపాతంగా కొనసాగించి ప్రత్యక్షంగా దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.రౌడీషీటర్ల ప్రమేయం ఉన్నట్లయితే వారి గత నేరచరిత్రను కూడా పరిశీలించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. "రౌడీయిజానికి విజయవాడలో స్థానం లేదని పోలీసులు స్పష్టమైన సందేశం ఇవ్వాలి" అన్నారు.వైసీపీ నేతలు డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారని, అదే సమయంలో స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు తమ వద్ద అసలు సర్టిఫికెట్లు, క్రీడా పతకాలు ఉన్నాయని చెబుతున్నారని ఉమా పేర్కొన్నారు. ఈ అంశంపై ఎవరి వద్ద ఆధారాలు ఉన్నా సంబంధిత అధికారులకు, న్యాయస్థానానికి సమర్పించాలని అన్నారు.ఆధారాలు ఉంటే చట్టబద్ధమైన మార్గంలో ముందుకు రావాలి. ఆధారాలు లేకుండా రోడ్లపై గొడవలు చేయడం, ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య పద్ధతి కాదు అని స్పష్టం చేశారు.విజయవాడ నగరంలో శాంతిభద్రతలను కాపాడే బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.విజయవాడ ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే ఏ చర్యనైనా సహించేది లేదని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై పార్టీలు, వ్యక్తులు అనే తేడా లేకుండా కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని, పోలీసు ఉన్నతాధికారులను బొండా ఉమా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నియోజకవర్గం కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## గురువులపై గూండాగిరి చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం

: గద్దె క్రాంతి కుమార్




విజయవాడ, సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ):- పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పి వారి భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. విజయవాడలో స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయుల విషయంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, వారిపై దాడి చేయడానికి ప్రయత్నించడం బాధించాయని పేర్కొన్నారు. గురువులు ఎక్కడ కనిపించినా గౌరవంతో నమస్కరించే సంస్కృతి మనదని, అలాంటి గురువులపైనే దాడులకు దిగడం సభ్య సమాజం సిగ్గుపడే విషయం అన్నారు. ఉపాధ్యాయుల నియామకాలు, వారి సర్టిఫికెట్లపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులను ఆశ్రయించి ఆధారాలతో విచారణ కోరాలి తప్ప. భౌతిక దాడులకు దిగడం, భయభ్రాంతులకు గురిచేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించారని, ఇప్పుడు కూడా వారిని రాజకీయ వివాదాల్లోకి లాగడం దురదృష్టకరమన్నారు. చదువు చెప్పాల్సిన గురువులను గతంలో వైన్స్ షాపుల వద్ద విధులకు వినియోగించిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఇప్పుడు ఉపాధ్యాయులపై జరిగిన ఘటనలను చూస్తుంటే రాజకీయ కక్షలు ఎంతటి స్థాయికి దిగజారాయో అర్థమవుతోందన్నారు. ఉపాధ్యాయులను అవమానించడం అంటే సమాజ భవిష్యత్తును అవమానించడమేనని క్రాంతి కుమార్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను, ముఖ్యంగా ఉపాధ్యాయులను రాజకీయ ప్రయోజనాల కోసం లక్ష్యంగా చేసుకోవడం మానుకోవాలని హితవు పలికారు. ఉపాధ్యాయుల గౌరవం, భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడదని, దాడులకు పాల్పడిన వారిని గుర్తించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని గద్దె క్రాంతి కుమార్ కోరారు. గురువులను గౌరవించడం మన సంస్కృతి అని కానీ ఆ సంస్కృతి వదిలి గురువులపై దాడి చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మం లో ఉద్యోగమేళా



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: కళాశాల టాస్క్ విభాగం స్కిల్ మాస్టర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ద్వితీయ, తృతీయ విద్యార్థినులకు జాబ్ డ్రైవ్ ప్రోగ్రామ్ నిర్వహించటం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, క్వెస్ ఏస్ బీఐ, టీమ్ లీజ్, డిజిటైడ్ అండ్ దీపెన్ ఎఐ కంపెనీల వారు ఈ జాబ్ డ్రైవ్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. 59 మంది విద్యార్థులు ఫాక్స్ కాన్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలో, ಣవవజూవఅ ‌ూ× లో పదిమంది విద్యార్థులు ఆఫర్ లెటర్స్ పొందారు అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భానోత్ రెడ్డి తెలియజేశారు. ఈ ప్రోగ్రాంలో టాస్క్ కో ఆర్డినేటర్ వి రామారావు, మెంటర్ సిహెచ్ కవిత పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగంపై విస్తృత తనిఖీలు రూ.1 లక్ష 49 వేల కు పైగా జరిమానాలు

అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 22 నేటి శుభోదయ: అనంతపురము నగరంలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరం మొత్తం విస్తృతంగా తనిఖీలు జరిపారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. రాజా రవీంద్రనాథ్ చౌదరి ఆధ్వర్యంలో పాతూరు ప్రాంతంలో ప్లాస్టిక్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సుమారు 15 దుకాణాలను తనిఖీ చేసి, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలకు సంబంధించి నిబంధనల మేరకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రూ.1 లక్ష 49 వేల కు పైగా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ, అనంతపురము నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దే దిశగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించడం, విక్రయించడం చేయకుండా వ్యాపారులు సహకరించాలని సూచించారు. ఇకపై కూడా ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై కఠినంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలతో పాటు నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని, స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన అనంతపురము నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలకు నగరంలోని 6 సర్కిల్ లకు సంబంధించిన శానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు సంబంధిత శాని టేషన్ సెక్రటరీలు పాల్గొనడం జరిగినది.

## క్రీడాకారులపై వైసీపీ దాడులను ఖండించిన వెంకట్ నామిశెట్టి



విజయవాడ, సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ):- క్రీడాకారులపై వైసీపీ దాడులను ఖండిస్తూ విజయవాడలోని జూడో అకాడమీలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వెంకట్ నామిశెట్టి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ స్పోర్ట్స్ టీచర్లు పై గూండాల దాడి సిగ్గు చేటని, గురుదేవోభవ అని గౌరవించాల్సిన టీచర్లపై నీచపు వ్యాఖ్యలు, బూతులా! నిబంధనల ప్రకారం ఉద్యోగాలు పొందిన వారిపై దాడులు, అవమానాలా? అని వెంకట్ ప్రశ్నించారు. టీచర్లపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్రీడాకారులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని, కోరారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, క్రీడాకారుల ఆత్మగౌరవం కాపాడాలని, ప్రభుత్వ ఉద్యోగులపై అనుచిత ప్రవర్తన, దాడులను అన్ని వర్గాలు ఖండించాలని వెంకట్ అన్నారు. క్రీడాకారులకు అండగా నిలవాలని, క్రీడాకారుల భద్రతపై ప్రభుత్వం నమ్మకం కల్పించాలని క్రీడా సంఘాలు, క్రీడాకారులు కోరుతున్నాయని వెంకట్ నామిశెట్టి తెలిపారు.

## ఘనంగా 36వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు పుట్టినరోజు వేడుకలు



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల 36వ డివిజన్ బి.ఆర్.ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్రావు పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది, బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్యవైశ్య వాసవి క్లబ్ ఐయుసి ఆఫీసర్ కొత్త వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది . బి.ఆర్.ఎస్ మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు 50 వ పుట్టినరోజు సందర్భంగా పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. అలాగే రాబోయే రోజుల్లో డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతూ అహర్నిష్యల్ డివిజన ప్రజల కొరకు సేవలు చేస్తూ నిరంతరం ప్రజలు కష్టసుఖాలతో తెలుసుకుంటూ వారి బాధల్లో తీరుస్తూ ఉంటారని అలాగే రాబోయే ఎన్నికల్లో కూడా మనమందరం కలిసి ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితి లో పసుమర్తి ని ఎన్నుకోవడం అవసరం అని తెలిపారు. డివిజన్లో ప్రజలకు ఏ బాధ వచ్చినా, ఏ కష్టం వచ్చినా నేను ఉన్నానని ప్రజలకు అండగా ఉండే నాయకుడు పుట్టినరోజు చాలా సంతోషంగా ఉందని అదేవిధంగా పసుమర్తి రామ్మోహన్రావు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయన జీవితాంతం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొరివెళ్ళ ప్రవీణ్ కుమార్, బిఆర్ఎస్ నగర మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ కార్పొరేటర్ బత్తుల మురళి, బోజేడ్ల రామ్మోహన్రావు, కనకం వీరభద్రం, గోల్డ్ రాధాకృష్ణ, కడవెండి శ్రీనివాసరావు, గుమ్మడి వెల్లి శ్రీనివాస్, మాశెట్టి వరప్రసాద్, గుండపల్లి దివాకర్ గుప్తా, ఆత్మకూరు వెంకట రామారావు, పిచ్చి హరిబాబు, బచ్చు మురళి, గార్లపాటి సంతోష్, వాసవి క్లబ్ బాధ్యులు దాత శ్రీనివాస్, పసుమర్తి శ్రీనివాస్, మురుగు యశ్వంత్, బావగాని సురేఖ, వేముల లత, ధనాల భవాని, గరివల్లి ఉమా, మానేపల్లి రామకృష్ణ, గరిడేపల్లి శ్రీనివాసరావు, బోర్లే పుల్లారావు, కాజా శ్రీనివాసరావు, పురివెళ్ల కాంతి కుమార్, డివిజన్ ప్రజలు మహిళలు భారీ ఎత్తున హాజరై నందుకు ప్రత్యేక శు భాకాంక్షలు తెలియజేశారు.



## ఖమ్మం 43వ డివిజన్‌లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఖమ్మం 43వ డివిజన్‌లో శ్రీ బాల గణేష్ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మహిళల ఆధ్వర్యంలో కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరస్వతి పూజను కూడా ప్రత్యేకంగా నిర్వహించి విద్యార్థులు, భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి అందరికీ అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమాలను కమిటీ సభ్యులు పూర్ణ నాయుడు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం భక్తుల సహకారంతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు, కార్యక్రమాల విజయానికి సహకరించిన కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంద్రమ్మ కాలనీలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



ఖమ్మం, కొత్తగూడెం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: కొత్తగూడెంలో గల పంజాబ్ గడ్డ 18వ డివిజన్ ఇంద్రమ్మ కాలనీలోని శ్రీ వరసిద్ధి వినాయక మండపం వద్ద మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హిమాశ్రీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కంచర్ల జమలయ్య మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్నదానం చేయడం ఎంతో గొప్పదని, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం మానవతా దృక్పథానికి నిదర్శనమని అన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక మండపం నిర్వాహకులను ఆయన అభినందించారు. అన్నదానం చేసిన నిర్వాహకులకు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలు ప్రసాదించాలని, భవిష్యత్తులో మరింత మంది పేదలు, అవసరంలో ఉన్న వారికి అన్నదానం చేసే స్తోమతను స్వామివారు కల్పించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు, మండల రాజు, ఉద్యోగ వెంకట్, ఈశ్వర్, రమేష్, రామకృష్ణ, గజ్జల ఈశ్వరయ్యతో పాటు మహిళా సోదరీమణులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ. 122 కోట్ల హెచ్‌ఏఎం నిధులతో ఏలూరు జిల్లాలోని పురపాలక సంఘాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం




ఏలూరు, సెప్టెంబర్, 22, నేటి శుభోదయ ::: ఏలూరు జిల్లాలోని పురపాలక సంఘాలు, ఏలూరు నగరపాలక సంస్థ లో రూ. 122 కోట్లహెచ్‌ఏఎం నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) లతో కలిసి మంగళవారం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శంఖుస్థాపన చేశారు. హైబ్రిడ్ యాన్యూటి మోడల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 121 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు కుప్పం నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు నగరపాలక సంస్థ, జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి పట్టణాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా అధికారులు, ప్రజలు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు నగర పాలక సంస్థకు రూ 50 కోట్లు, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి రూ 19 కోట్లు, నూజివీడు మున్సిపాలిటీకి రూ 35 కోట్లు, చింతలపూడి మున్సిపాలిటీకి రూ 18 కోట్లతో మొత్తం జిల్లాలో జిల్లాలో రూ 122 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థలో లో రూ 50 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టడం శుభపరిణా మమన్నారు. ఈ నిధుల ద్వారా నగరంలో పలు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఏలూరు నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డా.ఎం.జె. అభిషేక్ గౌడ, కమీషనర్ ఏ . భానుప్రతాప్, ఏలూరు ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏపి ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ప్రభృతులు పాల్గొన్నారు.



## చరిత్రలో నిలిచేలా అభివృద్ధి పనులు వేల కోట్లతో కనీవినీ ఎరుగని రీతిలో నిధులు..

రూ.30 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జూలకంటి



మాచర్ల, సెప్టెంబర్ 22: ఆర్ సి ఇన్చార్జ్ నేటి శుభోదయ: కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వేల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం మాచర్ల పట్టణంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద రూ.30 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో మాచర్ల పట్టణంలో పర్యటించిన సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలకు రూ.2 కోట్ల నిధులు రావడమే గొప్పగా భావించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఒకేసారి రూ.30 కోట్ల నిధులు మంజూరు కావడం అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

తాగునీరు, వరికపూడిశెలపై ప్రత్యేక దృష్టి

మాచర్ల నియోజకవర్గంలో సమగ్ర తాగునీటి సరఫరా కోసం దాదాపు రూ.1,000 కోట్లతో భారీ ప్రాజెక్టుల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. వరికపూడిశెల ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో సాగు, తాగునీటి వసతులు మెరుగుపడి వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. పర్యాటకం, పరిశ్రమల అభివృద్ధికి కూడా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎగువ పల్నాడు ప్రాంతానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి, అధికారుల సమన్వయంతో ప్రజలకు మేలు జరిగేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ మధుసూదన్ యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు పెద వెంకటరామిరెడ్డి, కొమెర దుర్గారావు, పోలూరు నరసింహారావు, మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, మాచర్ల వాసు, కంభపాటి అనిల్‌కుమార్, మందలపు రామకృష్ణ, వజ్రం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## తాడిగడప--ఉయ్యూరు హ్యామ్ పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు



పెనమలూరు, సెప్టెంబర్ 22 నేటి శుభోదయ: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో హ్యామ్ పథకం ద్వారా రూ.51 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారని, భారీగా నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఉయ్యూరు ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తోట్లవల్లూరు కృష్ణానది నుంచి రూ.98 కోట్లతో పైపులైన్ ద్వారా నేరుగా ఉయ్యూరుకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు, ఇప్పటికే సుమారు రెండు కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. ఉయ్యూరులో పాత పైపులైన్లను తొలగించి కొత్త పైపులైన్లతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నామని, హ్యామ్ పథకం కింద రూ.8 కోట్లతో మొదటి దశ రోడ్డు పనులు ప్రారంభించామని తెలిపారు. ఉయ్యూరులోని టిడ్కో ఇళ్లలో సుమారు 400 ప్లాట్లు వచ్చే నెలాఖరుకు ప్రారంభోత్సవానికి సిద్ధం కానున్నాయని వెల్లడించారు. టిడ్కో కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 15న సంక్రాంతి సందర్భంగా టిడ్కో ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు నిర్వహించేలా పనులు పూర్తి చేస్తామని బోడే ప్రసాద్ తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో హ్యామ్ మొదటి విడతలో రూ.51 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కోసం రూ.294 కోట్ల వరకు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో రూ.80 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. అభివృద్ధిలో రాజీ పడే ప్రసక్తే లేదని , ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేర్చడమే మా లక్ష్యం అని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షులు రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు, రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీత గోపీచంద్, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గణేష్, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, బిజెపి నాయకులు ఏకుల విజయేంద్ర ఉయ్యూరు, తాడిగడప మున్సిపాలిటీల డివిజన్ అధ్యక్షులు, కూటమి నాయకులు, మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విజయ డెయిరీ నూతన చైర్మన్ గా దాసరి బాలవర్ధనరావు.



విజయవాడ, సెప్టెంబర్ 22 నేటి శుభోదయ: కృష్ణా జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి- విజయ డెయిరీ నూతన ఛైర్మన్గా దాసరి వెంకట బాలవర్ధనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల చలసాని ఆంజనేయులు డెయిరీ ఛైర్మన్ పదవితోపాటు డైరెక్టర్ పదవికి కూడా రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో డెయిరీ నూతన ఛైర్మన్ ఎన్నిక విషయంలో అనేక ఊహాగానాలు తలెత్తాయి. వీటన్నింటినీ తోసిపుచ్చుతూ రెండు సార్లు శాసనసభ్యునిగా 15ఏళ్లుగా పాల సొసైటీ డైరెక్టర్గా వ్యవహరించిన సీనియర్ తెలుగుదేశం నాయకులు బాలవర్ధనరావుకు ఛైర్మన్గా అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానం భావించింది.మంగళవారం విజయ డెయిరీ కార్యాలయంలో సమావేశమైన డైరెక్టర్లు.. బాలవర్ధనరావు పేరును సామూహికంగా ప్రతిపాదిస్తూ ఏకగ్రీవంగా ఛైర్మన్గా ఎన్నుకున్నారు. అనంతరం నూతన ఛైర్మన్గా బాలవర్ధనరావు లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా రాజకీయాల్లో, తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన గన్నవరం నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా 1999, 2009లో గెలుపొందారు. విజయ డెయిరీలో డైరెక్టరుగా అనుభవాన్ని, పార్టీకి చేస్తోన్న సేవలను గుర్తించి ఛైర్మన్గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ కు బాలవర్ధనరావు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని పాడి రైతుల సంక్షేమానికి, విజయ డెయిరీని మరింత లాభాల బాటలో నడిపించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.

# డిసెంబర్ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నంది అవార్డుల ప్రదానోత్సవం

-సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

-అమరావతి లేదా విజయవాడ వేదికగా నంది ఫిల్మ్, నేషనల్ అవార్డులు

తిరుపతిలో టీవీ అవార్డుల ప్రదానం..2025తో పాటు పెండింగ్ అవార్డులు అందించేందుకు ప్రభుత్వం అంగీకారం

-సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో తెలుగు సినిమాకు సముచిత గౌరవం..తెర వెనుక శ్రమకు, తెరపై నటనకు పట్టం




అమరావతి, సెప్టెంబర్ 22 నేటి శుభోదయ: తెలుగు సినీ రంగంలో ప్రత్యేక స్థానం పొందిన నంది అవార్డులను ఈ డిసెంబర్ లో ఇవ్వనున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా కళాకారులకు, సాంకేతిక నిపుణులకు పెద్దపీట వేస్తూ తెలుగు చలనచిత్ర పరిశ్రమకు సముచిత గౌరవం కల్పిస్తూ..సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశం మేరకు నంది అవార్డుల వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు సెప్టెంబర్ లో కమిటీ ఏర్పాటు చేసి అక్టోబర్ లో ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని, నవంబర్ లో అవార్డులను ప్రకటించి, డిసెంబర్ లో ప్రదానం చేస్తామని స్పష్టం చేశారు.వివరాల్లోకి వెళ్తే....2025 సంవత్సరానికి అన్ని కేటగిరీల్లో నంది ఫిల్మ్, టీవీ అవార్డులను ఇవ్వాలని, దానితో పాటు 2012 నుండి 2016 వరకు ఇది వరకే ప్రకటించిన 288 ఫిల్మ్ అవార్డ్స్, 330 టీవీ అవార్డ్స్ ఇవ్వనున్నామన్నారు. అదే విధంగా 2017 నుండి 2024 వరకు సంవత్సరానికి 4 అవార్డుల చొప్పున (2 ప్రొడక్షన్, 2 స్పెషల్ జ్యూరీ) ఫిల్మ్ అండ్ టీవీ అవార్డులను ప్రదానం చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. అమరావతి లేదా విజయవాడ వేదికగా నంది ఫిల్మ్, జాతీయ చలన చిత్ర (నేషనల్ ఫిల్మ్) అవార్డులను, తిరుపతి వేదికగా నంది టీవీ అవార్డులను ఇవ్వాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. ఈ అవార్డులన్నీ కూడా డిసెంబర్ - 2026 లోగా ఇవ్వనున్నామన్నారు. తెర వెనుక శ్రమించిన ప్రతిభకు, తెరపై రక్తికట్టించిన నటనకు ప్రభుత్వం తరపున సత్కరించేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో చలనచిత్రాలు, జాతీయ సమైక్యతపై చలన చిత్రాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలు, విద్యా విషయక చిత్రాలు, తెలుగు సినిమాపై రచించిన ఉత్తమ రచనలు తదితర 46 అవార్డులను నంది ఫిల్మ్ అవార్డులుగా అందించనున్నామన్నారు. నంది ఫిల్మ్ అవార్డు గ్రహీతలకు బంగారు, వెండి, కాంస్య, తామ్ర నందులు, ప్రశంసాపత్రంతో పాటు నగదు పారితోషికం అందిస్తామన్నారు. అదే విధంగా వివిధ కేటగిరీల్లో 8 గోల్డ్ మెడల్స్ ఇస్తామన్నారు. జాతీయ చలన చిత్ర అవార్డుల విభాగంలో భాగంగా ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డులు(5 లక్షలు),బి.ఎన్. రెడ్డి నేషనల్ ఫిల్మ్ అవార్డులు(2 లక్షలు),నాగిరెడ్డి అండ్ చక్రపాణి నేషనల్ ఫిల్మ్ అవార్డులు(2 లక్షలు), రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డులు(2 లక్షలు) అందించనున్నామన్నారు. ఈ కేటగిరీలో అవార్డు గ్రహీతలకు జ్ఞాపిక, సన్మాన పత్రంతో పాటు నగదు పారితోషికం అందించబడుతుందన్నారు. నంది టీవీ అవార్డుల్లో భాగంగా టెలి చిత్రాలు, టి.వీ ఫీచర్స్, టి.వీ మెగా సీరియల్స్, టి.వీ డైలీ సీరియల్స్, టి.వీ బాలల చిత్రాలు, టి.వీ డాక్యుమెంటరీ చిత్రాలు, టి.వీ సామాజిక సంబంధిత చిత్రాలు, టి.వీ విద్యా విషయక చిత్రాలు తదితర విభాగాల్లో మొత్తం 48 అవార్డులను అందించనున్నామన్నారు. నంది టీవీ అవార్డు గ్రహీతలకు బంగారు, వెండి, కాంస్య, తామ్ర నందులు, ప్రశంసాపత్రంతో పాటు నగదు పారితోషికం అందిస్తామని వెల్లడించారు కూటమి ప్రభుత్వం వచ్చాక సింగిల్ విండో విధానంలో షూటింగ్ కు అనుమతులు త్వరితగతిన మంజూరు చేస్తున్నామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. త్వరలోనే ఫిల్మ్ పాలసీని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రకృతి సిద్ధమైన లొకేషన్లున్న ఏపీలో అధికంగా షూటింగ్ లు చేయాలని, డబ్బింగ్ థియేటర్లు, రికార్డింగ్ థియేటర్లు, రీరికార్డింగ్ థియేటర్లు తదితర మౌలిక వసతుల కల్పనకు ముందుకు వచ్చేవారికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని వెల్లడించారు. తెలుగు చలనచిత్ర రంగం కేవలం వినోదాన్ని పంచే మాధ్యమం మాత్రమే కాదని ,మన సంస్కృతికి, ఆత్మగౌరవానికి ప్రతిరూపం. కళను, కళాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించడమే ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నాం..ఎన్నో అద్భుతమైన చిత్రాలు, దశాబ్దాల పాటు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే నటన, తెర వెనుక శ్రమించిన ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణుల సేవలను గుర్తించి సత్కరించే కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాం అని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

## విజయదుర్గ అమ్మవారి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట ప్రతిష్ఠ



గుడివాడ, సెప్టెంబర్ 22 నేటి శుభోదయ: గుడివాడ లీలామహల్ రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్ 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా దేవస్థాన కమిటీ, ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో పందిరి రాట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయబద్ధంగా పసుపు కొట్టి ఉత్సవ రాటను ప్రతిష్ఠించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. పందిరి రాట ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నారా లోకేష్ ఆధ్వర్యంలో ఘనంగా పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలు



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 22 నేటి శుభోదయ: స్వర్గీయ నందమూరి తారకరామారావు, పరిటాల రవీంద్ర విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన యువనేత, మంత్రి నారా లోకేష్ . కార్యక్రమం అనంతరం పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామ్ పై తనకున్న ఆత్మీయతను చాటుకుంటూ.. ఆయనకు ప్రేమతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మంత్రి నారా లోకేష్ కి వీడ్కోలు పలికే సమయంలో పరిటాల సునీత వెంకటేశ్వర స్వామివారి విగ్రహాన్ని అందించి ఆత్మీయంగా సత్కరించారు.

## ఈనెల 24తో ముగియనున్న జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక పదవీకాలం.



మచిలీపట్నం, సెప్టెంబర్ 22 నేటి శుభోదయ : కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్గా ఉప్పాల హారిక ఐదేళ్ల పదవీకాలం ఈనెల 24వ తేదీతో ముగియనుంది. ఈ సందర్భంగా ఆమె తన పదవీకాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, జిల్లా పరిషత్కు ఆదాయ వనరులు సమకూర్చేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. ముందుగా జిల్లా పరిషత్ సభ్యులు మరియు మాజీ మంత్రి పేర్ని నాని, వైసిపి నాయకులు పదవి విరమణ చేయనున్న హారిక, రాము దంపతులను సత్కరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్గా ఐదేళ్లపాటు పనిచేయడం ఆనందంగా ఉందని ఉప్పాల హారిక తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ ఆశీస్సులతో జిల్లా అభివృద్ధిలో భాగస్వామి అయ్యే అవకాశం లభించిందన్నారు. తన పదవీకాలంలో జిల్లా అభివృద్ధికి సుమారు రూ.400 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. అధికారులు, జిల్లా పరిషత్ సభ్యుల సహకారంతో జడ్పీకి శాశ్వత ఆదాయ వనరులు సమకూర్చేలా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా పరిషత్కు ఆదాయం వచ్చే విధంగా పెట్రోల్ బంకులు, షాపింగ్ కాంప్లెక్స్లు, కన్వెన్షన్ హాల్ నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న సమయంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధికి సహకారం అందిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలకు కొన్ని అడ్డంకులు ఎదురయ్యాయని ఉప్పాల హారిక పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా పరిషత్ చైర్మన్గా అవకాశం కల్పించిన వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు రుణపడి ఉంటానని తెలిపారు. జిల్లా పరిషత్ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉప్పాల హారిక అన్నారు.

## శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో చివరి దశకు చేరుకున్న గణపతి నవరాత్రి మహోత్సవాలు

–ఉత్సవాల తొమ్మిదో రోజు శ్రీ శేష గణపతి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన స్వామివారు

నేడు స్వామివారి నిమజ్జన ఊరేగింపు




గుడివాడ, సెప్టెంబర్ 22 నేటి శుభోదయ: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన మెయిన్ రోడ్డు లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో గణపతి నవరాత్ర మహోత్సవాలు దిగ్విజయంగా చివరి దశకు చేరుకున్నాయి. ఉత్సవాల తొమ్మిదో రోజు శ్రీ శేష గణపతి అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారికి వేద పండితులు విశేష పూజలు చేశారు.బుధవారం ఉదయం లడ్డూ వేలంపాట, శాస్త్రోక్త పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం స్వామి వారి నిమజ్జన ఊరేగింపు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, ఈవో యార్లగడ్డ వాసు తెలిపారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన భక్తులకు రాజేష్, వాసు ధన్యవాదాలు తెలిపారు.ఉత్సవ వేడుకల్లో కమిటీ సభ్యులు , లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, ముళ్ళపూడి రమణమూర్తి, వికుర్తి పోతురాజు, వీరమాచినేని శైలజ, చాపరాల విజయలక్ష్మి, సోసుపల్లి శారద, గొంతుపల్లి కనకదుర్గ, గణపతి శాస్త్రి, దేవస్థాన సిబ్బంది నారాయణ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వైయస్ జగన్ ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదు

గత ప్రభుత్వంలో టిడిపి కార్యకర్తలపై ఎన్నో కేసులు నమోదు చేశారు

టిడిపికి కార్యకర్తలే బలం

రాప్తాడు బహిరంగ సభలో మంత్రి నారా లోకేష్ సంచలన వ్యాఖ్యలు



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 22 నేటి శుభోదయ : స్వర్గీయ నందమూరి తారకరామరావు, పరిటాల రవీంద్ర విగ్రహాల ఆవిష్కరణకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్ . కార్యక్రమం అనంతరం రాప్తాడు నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్పై తీవ్ర విమర్శలు చేశారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగులను మోసం చేసిన జగన్.. ఇప్పుడు ఉపాధ్యాయులపై దాడులు చేయించడం దారుణమన్నారు. నిన్న శాప్ కార్యాలయం వద్ద గురువులపై గొడ్డలిపార్టీ రౌడీమూకలు విచక్షణారహితంగా గుడ్లతో దాడిచేశారని, ఈ దాడిలో పాల్గొన్న రౌడీ బ్యాచ్ లో ఏ ఒక్కరినీ వదలిపెట్టమని లోకేష్ హెచ్చరించారు. రాప్తాడులో గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలను వేధించి, తప్పుడు కేసులు పెట్టిన తోపుదుర్తి ప్రకాశ్ అవినీతి, దాడుల రాజకీయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులను తొలగించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు.టీడీపీకి కార్యకర్తలే బలమని, కష్టకాలంలో పార్టీ జెండాను వీడకుండా పోరాడిన కార్యకర్తల త్యాగాలను ఎప్పటికీ మర్చిపోమని నారా లోకేష్ అన్నారు. కార్యక్రమం అనంతరం కార్యకర్తల కష్టసుఖాలను అడిగి తెలుసుకుని, వారి సమస్యలను స్వయంగా విన్నారు. కార్యకర్తల ఆరోగ్యం, సంక్షేమం కోసం పార్టీ అండగా ఉంటుందని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరినీ గుర్తించి తగిన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## పుట్టపర్తి నియోజకవర్గ త్రాగునీటి ఎద్దడి తక్షణ నివారణకు రూ.8.20 కోట్లు నిధులు మంజూరు

గ్రామాల్లో త్రాగునీటి సమస్య ఎక్కడా రానివ్వొద్దు

త్రాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నుంచి నిధుల కొరత లేదు

నీటి సమస్య ఉన్న గ్రామాలను తక్షణం గుర్తించి పరిష్కరించాలి

నీటి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులదే బాధ్యత

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

పుట్టపర్తి నియోజకవర్గ త్రాగునీటి సమస్య, పుట్టపర్తి మున్సిపాలిటీ త్రాగునీరు, వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమీక్ష



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 22 నేటి శుభోదయ : పుట్టపర్తి నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి నియోజకవర్గ త్రాగునీటి సమస్యలు, పుట్టపర్తి మున్సిపాలిటీలో నీటి సరఫరా, వివిధ అభివృద్ధి పనులపై గ్రామీణ త్రాగునీటి సరఫరా శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు త్రాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశమని, గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. నీటి సమస్య ఉన్న గ్రామాలను తక్షణమే గుర్తించి, సమస్య తీవ్రతను బట్టి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.నియోజకవర్గంలో తక్షణ త్రాగునీటి ఎద్దడి నివారణకు తన ప్రత్యేక కృషితో రూ.8.20 కోట్లు మంజూరు చేయించామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం నుంచి త్రాగునీటి సమస్య పరిష్కారానికి నిధుల కొరత లేదని, అవసరమైన చోట నిధులు వినియోగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకత పథకం ద్వారా పుట్టపర్తి మున్సిపాలిటీ త్రాగునీరు, వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.20 కోట్లు మంజూరు చేసి ఈరోజు సీఎం చేతుల మీదుగా ప్రారంభించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మంజూరైన నిధులతో చేపట్టాల్సిన ముఖ్యమైన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలని అధికారులను ఆదేశించాఆదేశించారు.



## భారీ వర్షాల నేపథ్యంలో చింతూరు డివిజన్లో 24ఐ7 కంట్రోల్ రూమ్లు ఏర్పాటు

– ప్రజల భద్రతకు ప్రాధాన్యత, వర్షాలు, వరద పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ




చింతూరు, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: భారీ వర్షాల నేపథ్యంలో చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఏటపాక నాలుగు మండలాల్లో ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు, వర్షాలు మరియు వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు 24ఐ7 డివిజనల్, మండల స్థాయి కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేసినట్లు ప్రాజెక్టు అధికారి, ఐ.టి.డి.ఏ. అండ్ సబ్-కలెక్టర్, చింతూరు శుభమ్ నోఖ్వాల్ తెలిపారు.దప్రజల సమస్యలపై తక్షణ స్పందనకు డివిజనల్ కంట్రోల్ రూమ్ చింతూరు ఐ.టి.డి.ఏ. కార్యాలయ సమావేశ మందిరంలో డివిజనల్ స్థాయి 24ఐ7 కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసి, సిబ్బందిని రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా నియమించారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజల నుంచి వచ్చే అత్యవసర సమాచారాన్ని స్వీకరించి, సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేస్తూ సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నామన్నారు. కంట్రోల్ రూమ్కు అందే ఫిర్యాదులు, సమాచారంలో ప్రధానంగా: భారీ వర్షాలు, వరదల పరిస్థితులు.రహదారులపై నీటి ప్రవాహం, రాకపోకలకు అంతరాయం. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు. తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల సమస్యలు. ప్రజల భద్రతకు సంబంధించిన ఇతర అత్యవసర పరిస్థితులు. వంటి అంశాలపై సమాచారం నమోదు చేసి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. నాలుగు మండలాల్లో మండల స్థాయి కంట్రోల్ రూమ్లు చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఏటపాక మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో మండల స్థాయి కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశామని తెలిపారు . ఆయా మండలాల్లో వర్షాలు, వరదల పరిస్థితులను స్థానిక స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మండల స్థాయిలో అందే సమాచారాన్ని సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ శాఖ, ఇతర లైన్ డిపార్ట్మెంట్ల అధికారులతో సమన్వయం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ?? కంట్రోల్ రూమ్ సంప్రదింపు నంబర్లు డివిజనల్ కంట్రోల్ రూమ్ సబ్-కలెక్టర్ కార్యాలయం, చింతూరు 9490026397 8121729228 చింతూరు మండల కంట్రోల్ రూమ్ 9492527695 కూనవరం మండల కంట్రోల్ రూమ్ 9652814712 వీఆర్ పురం మండల కంట్రోల్ రూమ్ 8008100892 ఏటపాక మండల కంట్రోల్ రూమ్ 8332085268 ప్రజలకు అధికారుల సూచనలు భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సమీప కంట్రోల్ రూమ్కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా వరద ప్రవాహాలు, నీట మునిగిన రహదారులు, ప్రమాదకర ప్రాంతాల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చింతూరు డివిజన్లో వర్షాలు, వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల భద్రతకు అవసరమైన ముందస్తు చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపడుతున్నట్లు సబ్-కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్ తెలిపారు.

## దసరా మహోత్సవాలలో సామాన్య భక్తుల సౌకర్యార్థం తీసుకునే నిబంధనలు అందరూ పాటించాలి.

ఈవో శినానాయక్



విజయవాడ, సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ):- దసరా మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్లో ఉన్నత స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న కీలక నిర్ణయాలను దేవస్థాన ఈవో వి.కె. శీనా నాయక్ మంగళవారం సాయంత్రం మహా మండపం సమావేశ మందిరంలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులు, ఆలయ సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మాట్లాడుతూ కలెక్టర్, పోలీస్ కమిషనర్, దేవాదాయ శాఖ, మునిసిపల్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఏఐ సాంకేతికతతో క్యూలైన్ల నిర్వహణ, భద్రత, స్మార్ట్ లడ్డూ వెండింగ్ మిషన్లు, ట్రాఫిక్ నియంత్రణ మరియు పార్కింగ్ అంశాలపై కార్యాచరణ సిద్ధమైందని పేర్కొన్నారు. దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రికి తరలివచ్చే లక్షలాది మంది సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, నగర పాలక సంస్థలు సమన్వయంతో తీసుకునే నిర్ణయాలు, మార్గదర్శకాలను ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ విధిగా పాటించి సహకరించాలని ఈవో స్పష్టం చేశారు.ప్రోటోకాల్ దర్శనాల విషయంలో నిబంధనలు పాటిస్తూ, సాధారణ భక్తుల దర్శనానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని, ఏదైనా సందర్భం వస్తే వంద మంది లేదా రెండు వందల మంది సౌకర్యం కోసం లక్షలాది మందిని ఇబ్బంది పెట్టలేమని, దేవస్థానంకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్నందున దానికి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నామని అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఇంద్రకీలాద్రి కి వచ్చే భక్తుల సేవలో అంతా సహకరిస్తామని ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు సభ్యులు, సిబ్బంది పేర్కొన్నారు. ఈ సమావేశంలో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 123 మున్సిపాలిటీల్లో రూ.11,360 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు వర్చువల్ శంకుస్థాపన

**-గుడివాడ పట్టణ అభివృద్ధికి రూ.40 కోట్లు మంజూరు**

**-రోడ్లు, సెంట్రల్ డివైడర్లు, లైటింగ్, పార్కుల అభివృద్ధికి శ్రీకారం.**

**-ఐఎంఏ హాల్లో కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్నీ తిలకించిన....మ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు, కార్యకర్తలు**

**-సీఎం ప్రసంగం అనంతరం శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాము**

**-లాభాపేక్షతో కాదు, గుడివాడపై ప్రేమతోనే అభివృద్ధి చేస్తున్నా....ఎన్టీఆర్ హయాంలోలా గుడివాడను మళ్లీ బ్రాండ్ గా నిలపడమే లక్ష్యం**

**-రోడ్ల అభివృద్ధికి మరో రూ.50 కోట్లు మంజూరు... సెప్టెంబర్ 25 నుండి 29 వరకు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

**-90 ఏళ్ల గుడివాడ పురపాలక సంఘం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు...గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో తాగునీరు, రోడ్లు అధ్వానంగా మారాయి**



గుడివాడ, సెప్టెంబర్ 22 నేటి శుభోదయ: కూటమి ప్రభుత్వం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టిన బృహత్తర అడుగులో భాగంగా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో రూ.11,360 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా గుడివాడ పట్టణంలో రూ.40 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, సెంట్రల్ డివైడర్లు, లైటింగ్, పార్కుల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.గుడివాడ సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ఏర్పాటు చేసిన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు, కార్యకర్తలు తిలకించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగాన్ని ఎమ్మెల్యే రాముతో పాటు కూటమి శ్రేణులు ఆసక్తిగా విన్నారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, పట్టణ మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం వివరించారు. సీఎం వర్చువల్ కార్యక్రమం ముగిసిన అనంతరం ఐఎంఏ హాల్లో ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మాత్రమే కాకుండా గుడివాడలోనూ అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. దాదాపు 90 ఏళ్ల క్రితం ఏర్పడిన గుడివాడ పురపాలక సంఘం అభివృద్ధిలో ఆశించిన స్థాయికి చేరుకోలేదని పేర్కొన్నారు.దశాబ్దాలు గడిచినా పట్టణంలో మౌలిక సదుపాయాల విషయంలో పెద్దగా మార్పు కనిపించలేదని, గత ప్రభుత్వాన్ని నిర్లక్ష్యపాలనతో తాగునీరు, రహదారులు తదితర వ్యవస్థలు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. రోడ్ల వెంబడి అపరిశుభ్ర వాతావరణం, పేరుకుపోయిన చెత్తను చూసిన ప్రతిసారీ బాధ కలిగేదని, ఈ పరిస్థితులను మార్చలేమా అనే ఆలోచన తనలో ఉండేదని చెప్పారు. గుడివాడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కట్ట తెగిపోయిన సమయంలో నాలుగేళ్లపాటు సమస్యను పట్టించుకోలేదని రాము అన్నారు. గత ప్రభుత్వం మరమ్మతులకు రూ.4 కోట్ల అంచనాలు వేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యపై దృష్టి సారించి రూ.13 లక్షలతో మరమ్మతులు పూర్తి చేసి చెరువును అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు.పట్టణంలోని శివారు కాలనీల పరిస్థితి మరింత దారుణంగా ఉండేదని, గత పాలకులు మౌలిక వ్యవస్థలను తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్క సమస్యను గుర్తించి పరిష్కరిస్తూ వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని తెలిపారు.క్లీన్ గుడివాడ దిశగా అడుగులు. కొద్దిపాటి శ్రమతోనే క్లీన్ గుడివాడ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లామని ఎమ్మెల్యే రాము తెలిపారు. తాగునీటి వ్యవస్థలను అభివృద్ధి చేసుకుంటున్నామని, ఒక పద్ధతి ప్రకారం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ గుడివాడలో స్పష్టమైన మార్పు తీసుకువస్తున్నామని చెప్పారు.గతంలో పాలనకే పరిమితమయ్యారని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గత పాలకులు ఆసక్తి చూపలేదని రాము వ్యాఖ్యానించారు. గత పాలకులు పెట్టిన ఇబ్బందులకు ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించడం ద్వారా తమ నిర్ణయాన్ని స్పష్టం చేశారని అన్నారు. నేడు గుడివాడలో వచ్చిన మార్పును ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధిని ప్రజలు చూస్తారని ఎమ్మెల్యే తెలిపారు.

### ప్రతి వీధిలో ఎండ్ టు ఎండ్ రోడ్లు

గుడివాడ పట్టణంలో రోడ్ల అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు కానున్నాయని ఎమ్మెల్యే రాము వెల్లడించారు. ప్రతి వీధిలో ఎండ్ టు ఎండ్ రోడ్లను నిర్మిస్తామని, భవిష్యత్తులో గుడివాడలో ప్రజలు కాలికి దుమ్ము అంటకుండా రోడ్లపై తిరిగి ఇంటికి వెళ్లే స్థాయిలో రహదారులను అభివృద్ధి చేస్తామని అన్నారు.అమృత్ పథకం ద్వారా ఎస్ ఎస్ ట్యాంకులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. పట్టణంలో రోడ్ల సమస్యలు ఉన్నాయని ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని కూటమి శ్రేణులు ప్రజలకు ధైర్యంగా చెప్పాలని సూచించారు.

### కొత్త గుడివాడ నిర్మాణమే లక్ష్యం.

ప్రజలు, అధికారులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే అన్ని మౌలిక సదుపాయాలతో కొత్త గుడివాడను రూపొందించవచ్చని ఎమ్మెల్యే రాము అన్నారు. పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత దగ్గరగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని, ప్రతి వీధిలోని సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.సెప్టెంబర్ 25 నుంచి 29వ తేదీ వరకు ప్రతి వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించాలని తెలిపారు. తాను లాభాపేక్షతో ఈ అభివృద్ధి పనులు చేయడం లేదని, తన గుడివాడపై ఉన్న ప్రేమతోనే అభివృద్ధికి కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. గుడివాడ ఒక ప్రత్యేక స్థాయిలో ఉండాలని, పట్టణం ఒక బ్రాండ్‌గా మారాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్ గుడివాడను ఏ విధంగా ప్రత్యేకంగా నిలిపారో, అదే స్థాయిలో గుడివాడకు మళ్లీ గుర్తింపు తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.అందుకు ప్రతి ఒక్కరూ కొంత సమయం గుడివాడ కోసం కేటాయించాలని, పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం కూటమి శ్రేణులు చేసిన నినాదాలతో ఐఎంఏ హాల్ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్,పట్టణ టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, లింగం ప్రసాద్, కార్పొరేషన్ డైరెక్టర్లు దింట్యాల రాంబాబు, మజ్జాడ నాగరాజు, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, బిజెపి అధ్యక్షుడు ఆర్కే, జనసేన నాయకులు సందు పవన్, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, షేక్ జానీ, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ జోన్స్ దయానంద్, బొంబాయి శ్రీను, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు,మున్సిపల్ ఇంజనీర్ సతీష్ చంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ శివాజీ, ఏవ లు రాజేష్, శ్రావణ్, సత్యనారాయణ, శివాజీ, గుడివాడ పట్టణంలోని పలువురు కూటమి నాయకులు,36 వార్డుల పరిధిలోని టిడిపి కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

**ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: జిల్లావ్యాప్తంగా నేడు నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిపేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించేందుకు వివిధ శాఖల అధికారులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించినట్లు ఆయన అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తగినంత మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జనం కోసం 18 రన్నింగ్/రెగ్యులర్ క్రేన్లు, 2 రొటేటింగ్ క్రేన్లను అందుబాటులో ఉంచారన్నారు. గ్యాస్ కట్టర్లు, స్పేర్ డ్రైవర్లు, సాంకేతిక సిబ్బందిని షిఫ్టుల వారీగా కేటాయించినట్లు తెలిపారు.మత్స్య శాఖ, విపత్తు నిర్వహణ శాఖ సమన్వయంతో నిమజ్జన పాయింట్ వద్ద నిపుణులైన 150 మంది గజ ఈతగాళ్ళను, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్, ట్యూబులు, తాళ్ళు మరియు రక్షణ పడవలు షిఫ్ట్ ల వారిగా అందుబాటులో ఉంచామన్నారు. మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా నిమజ్జన మార్గాల్లో పారిశుధ్యం, నిరంతర తాగునీటి సరఫరా, తాత్కాలిక దీపాలు, బారికేడింగ్ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఊరేగింపు మార్గాల్లో దారికి అడ్డుగా ఉన్న విద్యుత్ కేబుల్స్, లో-హ్యాంగింగ్ వైర్లను సరిచేసి, విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు, సిబ్బంది నియమించామన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, ప్రత్యేక వైద్య బృందాలు, కాటు (పాము/కుక్క) మందులు మరియు 108 అంబులెన్స్‌లను 24 గంటల పాటు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో ఫైర్ ఇంజన్లు, రెస్క్యూ వాహనాలు సిద్ధంగా ఉంచమన్నారు. భక్తులందరూ సూచించిన రూట్ మ్యాప్ ప్రకారం నిమజ్జన ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. అధికారులకు, పోలీసులకు సహకరించి గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## గణేష్ నిమజ్జనం పాయింట్ కు చేరుకునే మార్గాలు, పాటించవలసిన ట్రాఫిక్ సూచనలు




ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: రూరల్ మండలం నుంచి మరియు రాపర్తి నగర్,బీసీ కాలనీ, కూరగాయల మార్కెట్, ఆర్ఆర్ స్కూల్ ఏరియా, కొత్త బస్టాండ్ ఏరియా, సాయిబాబా ఆర్చ్, ఆర్టిఏ ఆఫీస్ ఏరియా, బ్యాంక్ కాలనీ, వికలాంగుల కాలనీ, బల్లేపల్లి,ఖానాపురం టేకులపల్లి,న్యూ విజన్ కాలేజ్ వైపు నుండి వచ్చే గణేష్ విగ్రహాలు బైపాస్ ద్వారా ఎన్టీఆర్ సర్కిల్ కి చేరుకొని అక్కడి నుండి ఇల్లందు ఎక్స్ రోడ్, గవర్నమెంట్ హాస్పిటల్ జడ్పీ సెంటర్,చెరువు బజార్ బోనకల్ ఎక్స్ రోడ్, చర్చి కాంపౌండ్, ముస్తాఫ్ నగర్ సంబానినగర్, రాఘవ మెడికల్స్, శ్రీరామ్ హిల్స్, దంసలాపురం చెరువుకి వెళ్లేదారి గుండా నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి. పంపింగ్ వెల్ రోడ్, గాంధీనగర్, మోతీనగర్, పిఎస్ఆర్ రోడ్, గాంధీచౌక్ సారధినగర్, బొక్కలగడ్డ నుండి వచ్చే వాహనాలు నయాబజార్ నుండి జూబ్లీ క్లబ్ మయూరి సెంటర్, మామిళ్లగూడెం, బురాన్ పురం, బస్ డిపో ఏరియా, కమాన్ బజార్, కస్బా బజార్ నుండి వచ్చే వాహనాలు కిన్నెరసెంటర్, జడ్పీ సెంటర్, చెరువు బజార్ , చర్చి కాంపౌండ్ మీదుగా నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి. శ్రీ శ్రీ, సర్కిల్, శ్రీ నగర్ కాలనీ, రోటరీ నగర్, ఇందిరానగర్, పాత మమతా మెడికల్ కాలేజీ, మమత ఎక్స్ రోడ్, కవి రాజు నగర్, పాత కలెక్టరేట్ బ్యాక్ గల విగ్రహాలు, గట్టయ్య సెంటర్, బ్యాంక్ కాలని,వీడియోస్ కాలనీ నుండి వచ్చే వాహనాలు ఇల్లందు ఎక్స్ రోడ్డు నుండి జడ్పీ కి చేరుకొని చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి. వెంకటగిరి ఎక్స్ రోడ్, శ్రీనివాస నగర్, గ్రేయిన్ మార్కెట్ ఏరియా, ప్రకాష్ నగర్, గుట్టల బజార్, జహీర్ పుర తండా అయ్యప్ప స్వామి టెంపుల్ ఏరియా విగ్రహాలు మొత్తం మెయిన్ రోడ్డు ద్వారా చర్చి కాంపౌండ్ కి చేరుకొని అక్కడి నుండి నిమజ్జనం పాయింట్ కి చేరుకోవాలి. గొల్లగూడెం మధురానగర్ రాఘవయ్య నగర్ మమతా కాలేజ్, హార్వెస్ట్ స్కూల్ ఏరియా, అల్లిపురం, కొత్తగూడెం, అల్లిపురం ఎక్స్ రోడ్డు నుండి వచ్చే విగ్రహాలు టాటా మోటార్స్ ద్వారా చెరువు బజార్, చర్చి కాంపౌండ్ ద్వారా నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి. బోనకల్ ఎక్స్ రోడ్, చర్చి కాంపౌండ్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, మిషన్ హాస్పిటల్ ఏరియా, ముస్తఫా నగర్, సంబాని నగర్, పరికముక్కల కాలనీ, శ్రీరామ్ నగర్, శ్రీరామ్ హిల్స్ నుండి వచ్చే విగ్రహాలు మెయిన్ రోడ్డు ఎక్కి నిమజ్జనం పాయింట్ కు చేరుకోవాలి.

- తిరుగు ప్రయాణం

నిమజ్జనం అనంతరం ప్రజలు మరియు వాహనాలు నిమజ్జనం పాయింట్ నుండి జయశంకర్ విగ్రహం వరకు చేరుకొని ప్రకాష్ నగర్, శ్రీనివాస్ నగర్, జహీర్ పుర తండా, అయ్యప్ప టెంపుల్, వెంకటగిరి ఎక్స్ రోడ్ వైపు వెళ్లేవారు దంసలాపురం బ్రిడ్జిని దాటి బ్రిడ్జి కింది నుండి దంసలాపురం ఊర్లో నుండి ఎస్వీఎం స్కూల్ గుండా శ్రీనివాస నగర్, అయ్యప్ప టెంపుల్, ప్రకాష్ నగర్ వైపు వెళ్లి మెయిన్ రోడ్డు ద్వారా వారి గమ్యస్థానాలకు వెళ్ళవచ్చును. ముస్తఫా నగర్, మమతా రోడ్, ఇల్లందు ఎక్స్ రోడ్, ఎన్టీఆర్, బల్లేపల్లి మామిళ్లగూడెం, న్యూ బస్టాండ్ రాపర్తి నగర్, రూరల్ వైపు వెళ్లేవారు జయశంకర్ విగ్రహం దగ్గర నుండి శ్రీరామ్ హిల్స్, రాఘవ మెడికల్స్ దగ్గర రోడ్ క్రాస్ చేసి పరికముక్కల కాలనీ ద్వారా అల్లిపురం ఎక్స్ రోడ్డుకు చేరుకొని అక్కడి నుండి టాటామోటార్స్, లకారం, మమత ఎక్స్ రోడ్డుకు చేరుకొని ఇందిరానగర్, శ్రీశ్రీ ద్వారా బైపాస్ కు చేరుకొని వారి గమ్యస్థానాలకు వెళ్ళవచ్చు. వినాయక నిమజ్జనం అనంతరం బయటకు వెళ్లే దారులను కేవలం వన్ వే ట్రాఫిక్ మాత్రమే అనుమతించబడును కావున ప్రజలందరూ ఇట్టి విషయాన్ని గమనించి ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరించగలరు.

# మద్యం దుకాణాలు, బార్లల్లో 24 గంటల పాటు మద్యం విక్రయాలపై నిషేధం

**- వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఉత్తర్వులు**

ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు అండ్ రెస్టారెంట్లు, క్లబ్బులు ఇతర మద్యం విక్రయించే, సర్వ్ చేసే సంస్థలు నేడు (బుధవారం) ఉదయం 6.00 గంటల నుంచి రేపు (గురువారం) ఉదయం 6.00 గంటల వరకు పూర్తిగా మూసివేయాలని, ఈ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయాలు లేదా సరఫరా చేయరాదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు.నేడు (బుధవారం) వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజల శాంతిభద్రతలను, ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తెలంగాణ ఎక్సైజ్ చట్టం --1968లోని సెక్షన్ 20 ను వినియోగిస్తూ, ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# కళ్యాణదుర్గం డివిజన్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు



అమరావతి, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: మండలాల వారీగా వర్షపాతం నమోదు అయ్యింది.

కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో గత 24 గంటల్లో (21.09.2026 ఉదయం 8:30 నుండి 22.09.2026 ఉదయం 8:30 వరకు) మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. కణేకల్ మండలంలో అత్యధికంగా 80.0 మి.మీ వర్షపాతం నమోదు కాగా, బెలుగుప్ప, కళ్యాణదుర్గం, కంబదూరు, సెట్టూరు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి.డివిజన్ పరిధిలోని మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో): కణేకల్: 80.0 మి.మీ (భారీ వర్షం), బెలుగుప్ప: 46.8 మి.మీ, కళ్యాణదుర్గం: 38.6 మి.మీ, కంబదూరు: 34.6 మి.మీ, సెట్టూరు: 34.2 మి.మీ, బ్రహ్మసముద్రం: 10.8 మి.మీ, కుందుర్పి: 10.4 మి.మీ, బొమ్మనహాళ్: 8.2 మి.మీ, గుమ్మఘట్ట: 8.2 మి.మీ, డి. హిరేహాళ్: 5.8 మి.మీ, రాయదుర్గం: 5.2 మి.మీ ఈ వర్షాలతో డివిజన్ పరిధిలోని వాగులు, వంకలు స్వల్పంగా ప్రవహిస్తుండగా, వర్షాభావ పరిస్థితులతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ వర్షం కొంత ఉపశమనాన్ని ఇచ్చింది.

# కేజీబీవీ తిరుమలాయపాలెంలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం




ఖమ్మం, తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: కేజీబీవీ పాఠశాల, తిరుమలాయపాలెంలో ప్రిన్సిపాల్ రాధారాణి అధ్యక్షతన 8వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ తరఫున రీజినల్ ప్రెసిడెంట్ యం.డి. నవాబ్ పాషా విద్యార్థులకు చదువు యొక్క ప్రాధాన్యత, కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం, జీవితంలో లక్ష్యాలను ఎలా ఏర్పరచుకోవాలి, వాటిని ఎలా సాధించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. సైకాలజిస్ట్ సుప్రియ కొత్తపల్లి సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలను వివరించడంతో పాటు, విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంపొందించుకోవడానికి అవసరమైన నైపుణ్యాల గురించి వివరించారు. నేషనల్ కోఆర్డినేటర్ (సర్వీస్) విడిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. బొమ్మగాని నరసింహారావు మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం సీడ్ బాల్స్ తయారీ విధానం, వాటిని ఎక్కడ, ఎలా వేయాలి అనే అంశాలను విద్యార్థులకు ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో 500 సీడ్ బాల్స్‌ను ప్రిన్సిపాల్ రాధారాణి కి అందజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, చదువు, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విలువైన అవగాహన పొందారు.

# నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం పర్యటించమన్నారు. తొలుత ఉదయం 8:40 గంటలకు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. ఉదయం 9:20 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో.. అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:15 గంటలకు అశ్వాపురం మండలంలోని మారెళ్ళపాడు గ్రామంలో సాగునీటి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తారు. ఈ మేరకు.. రాష్ట్ర మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు.ం

# మండల సమీకృత కార్యాలయ భవన నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

**: రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**- పనులు క్వాలిటీగా ఉంటేనే బిల్లులు మంజూరు**

**- ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతంలో నిర్మిస్తున్న ఖమ్మం రూరల్ మండల సమీకృత కార్యాలయాల భవన సముదాయ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి**



ఖమ్మం, ఏదులాపురం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ప్రజలకు ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి సుపరిపాలన అందించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన ఖమ్మం రూరల్ మండల సమీకృత కార్యాలయాల భవన నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతంలో నిర్మిస్తున్న ఖమ్మం రూరల్ మండల సమీకృత కార్యాలయాల భవన సముదాయ నిర్మాణ పనుల పురోగతిని మంత్రి మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎక్కడా తగ్గకుండా చేపడుతున్నదని, ఖమ్మం రూరల్ మండలంలో కార్యాలయ సముదాయ నిర్మాణ పనులను సుమారు 45 కోట్ల రూపాయలతో చేపట్టామని, పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని, పనుల్లో వేగం పెంచి నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ లేదని, పనులు క్వాలిటీగా ఉంటేనే బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. ఖమ్మం రూరల్ మండలానికి సంబంధించి కార్యాలయాలు ఒకే చోట ఉండేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇక్కడ భవన



నిర్మాణ నాణ్యతలో మంచి ప్రమాణాలు పాటించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. వివిధ సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం అన్ని సదుపాయా లతో, సౌకర్యవంతంగా ఉండే విధంగా భవన సముదాయాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఖమ్మంలో కవిరాజు నగర్ లో హరివిల్లు అపార్ట్మెంట్లో గణపతి నవరాత్రుల కార్యక్రమం

ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల హరివిల్లు అపార్ట్మెంట్ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినాయక పూజ లో జక్కంపూడి సుధాకర్, వరలక్ష్మి దంపతులు, బొంతు మాధవరావు, సుధా దంపతులు పూజా కార్యక్రమం లో పాల్గొన్నారు. అపార్ట్మెంట్లో పిల్లలకు వారు గిఫ్ట్ స్పాన్సర్ చేసి రాయల్ రాంబాబు, ఝాన్సీ దంపతులు పిల్లలకు గిఫ్టు పంపిణి చేశారు. స్వామివారి పూజ అనంతరం భక్తులందరికీ కమిటీ వారిచే టిఫిన్ (అల్పాహారం) ఏర్పాటు చేయబడింది. రాత్రి పూజ అనంతరం స్వామి వారి లడ్డు, హుండీ, ధోవతి - కండువా వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ వాసులందరూ పాల్గొన్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, గణనాథునికి పుష్పాభిషేకాలు



విజయవాడ, సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ):-64వ డివిజన్ లోని కండ్రికలో శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు కాకొల్లు రవి కుమార్ ఆధ్వర్యంలో 8వ గణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 9వ రోజు మంగళవారం ఉదయం కాకొల్లు రవి కుమార్, సతీమణి వరలక్ష్మీతో కలిసి తెల్లవారుజామున వినాయకునికి ప్రత్యేక పూజలు, పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి చవితి నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 14వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రతిరోజు తెల్లవారుజాము నుంచి వినాయకుని కి ప్రధాన అర్చకులు విశేష పూజలు నిర్వహిస్తారని తెలిపారు. వినాయకుడు విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే దేవుడని, ప్రతి శుభకార్యానికి గణనాథుడి పూజతో శ్రీకారం చుట్టడం మన సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. వినాయక చవితి పర్వదినం భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. గణనాథుని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సకల అష్టైశ్వర్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో ఉన్న అన్ని విఘ్నాలు తొలగి అభివృద్ధి, విజయాలు చేకూరాలని శ్రీ వినాయకుడిని, అమ్మవారిని వేడుకున్నానని రవికుమార్ అన్నారు. నేటి సాయంత్రం 4 గంటలకు లడ్డూ వేలం పాటతో పాటు భారీ ఊరేగింపుతో వినాయకుని నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్వర్యంలో 8సంవత్సరాల నుండి చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామి వారి సేవకు శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు, సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్య అతిథులుగా పి.ఎస్.ఎస్. చైర్మన్ సాగర్ శ్రీనాథ్, డైరెక్టర్ పొన్నం శేషగిరిరావు పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించి, 8 సంవత్సరాలుగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు కాకొల్లు రవికుమార్ ని అభినందించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు. అన్నవితరణ కార్యక్రమంలో సుమారు 5వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 6:30 గంటలకు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, గణనాథునికి పుష్పాభిషేకాలతో పాటు, మహిళా భక్తులతో దీపారాధనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇరుముడి సినిమాను ప్రదర్శించారు. మహిళా భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర, తోట సత్యనారాయణ,తోట వెంకట ప్రసాద్,పట్టేం శెట్టి నాగమణి,ఇ. హరికృష్ణ రెడ్డి, చిన్నారులు, స్థానిక భక్తులు, తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల కార్లపై రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**- బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి : మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల అశోక్**



ఖమ్మం, తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రయాణిస్తున్న కార్లపై రాళ్ల దాడి చేయడాన్ని మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. దాడికి కారకులైన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల అశోక్ తెలిపారు. సుద్దవాగు తండాలో గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా కాంగ్రెస్ నాయకుల కార్లపై రాళ్ల దాడి జరగడం దురదృష్టకరమని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే కొందరు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు తంబూరి దయాకర్ రెడ్డి, బీరోలు సొసైటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్ రెడ్డి, పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ తదితరులు ప్రయాణిస్తున్న కార్లపై రాళ్ల దాడి జరిగిందని తెలిపారు. దాడికి కారకులైన బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని కొప్పుల అశోక్ కోరారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా చూడాలని ఆయన సూచించారు. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, మండల కాంగ్రెస్ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, జూపెడ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు సామ శ్రీనివాస్ రెడ్డి, ముక్కాపాటి నాగేశ్వరరావు గుడిపూడి వీరభద్రం చీమ లక్ష్మయ్య, రాజారం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు సామ శ్రీనివాస్ రెడ్డి తాడబోయిన కృష్ణ, గుగ్గిళ్ళ అంబేద్కర్ పుల్లూరి నాగరాజు బొజ్జ కొండల్ బందారు గంగరాజు షేక్ ఫయాజ్ మందులు చిరంజీవి చీమ లక్ష్మయ్య బానోత్ నాగేష్ సామ్య నల్లగట్టు ప్రభాకర్ గుండా లింగయ్య కొత్తపల్లి ఉషా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండ ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 22 (నేటి శుభోదయ):-బిఆర్ టిఎస్ రోడ్డు లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయం లో 29వ డివిజన్ మధురానగర్ ప్రాంతానికి చెందిన 6 కుటుంబాలకు 4 లక్షల 87 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అందజేశారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్యం అనుకోకుండా ఎదురైతే వైద్య ఖర్చులు భరించడం ఎంతో కష్టంగా మారుతుందని అన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు.29వ డివిజన్ మధురానగర్ ప్రాంతానికి చెందిన 6 కుటుంబాలకు 4.87 లక్షల విలువైన చెక్కులను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదలకు జవీ=ఖీ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని ఉమా తెలిపారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజల కష్టాల్లో వారికి అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఉమా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, సింగం వెంకన్న, డివిజన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి అంగిరేకుల రాంబాబు, కడప కోటేశ్వరరావు, బర్మా శ్రీను తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా ఖమ్మంలో కవిరాజు నగర్ లో హరివిల్లు అపార్ట్మెంట్లో గణపతి నవరాత్రుల కార్యక్రమం



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల హరివిల్లు అపార్ట్మెంట్ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినాయక పూజ లో జక్కంపూడి సుధాకర్, వరలక్ష్మి దంపతులు, బొంతు మాధవరావు, సుధా దంపతులు పూజా కార్యక్రమం లో పాల్గొన్నారు. అపార్ట్మెంట్లో పిల్లలకు వారు గిఫ్ట్ స్పాన్సర్ చేసి రాయల్ రాంబాబు, ఝాన్సీ దంపతులు పిల్లలకు గిఫ్ట్ పంపిణి చేశారు. స్వామివారి పూజ అనంతరం భక్తులందరికీ కమిటీ వారిచే టిఫిన్ (అల్పాహారం) ఏర్పాటు చేయబడింది. రాత్రి పూజ అనంతరం స్వామి వారి లడ్డు, హుండీ, ధోవతి - కండువా వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ వాసులందరూ పాల్గొన్నారు.

## అధైర్యపడకమ్మా, అండగా ఉంటా అగ్ని ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులాలికి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి భరోసా

**- రూ.20వేల తక్షణ ఆర్థిక సాయం అందజేత,**

**ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ఆర్డీవోకు ఆదేశాలు**



ఖమ్మం, కొత్తగూడెం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: పాల్వంచ మండలంలోని కరకవాగు ప్రాంతానికి చెందిన ఎండీ. ముబీన్ నివాస గృహం ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కొత్తగూడెంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి, తమ గోడును వెళ్లబోసుకున్నారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి పొంగులేటి రూ.20 వేలను తక్షణ సాయంగా వారికి అందజేశారు. అలాగే ఈ కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. అధైర్య పడవద్దని, ఒక అన్న లాగా మీ కుటుంబానికి అండగా నిలుస్తానని మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు రెవెన్యూ మంత్రి పొంగులేటికి మనసారా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ల మురళి, తదితరులు పాల్గొన్నారు.

## రాప్తాడులో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు జన నీరాజనం

**రాప్తాడు నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ ఒ కమ్యూనికేషన్ ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ కు రాప్తాడు కూడలిలో అపూర్వ స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు..**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 22 నేటి శుభోదయం : రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు..పెద్దఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు..మంత్రి లోకేష్ రాకను పురస్కరించుకుని పెద్దఎత్తున బాణసంచా కాల్చి, డప్పులతో శ్రేణుల సంబరాలు..రాప్తాడు సర్కిల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించిన మంత్రి నారా లోకేష్..పరిటాల శ్రీరామ్ తో కలిసి వాహనం పైకి ఎక్కి ప్రజలకు, పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్..భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మంత్రి లోకేష్‌లిఅనంతరం రాప్తాడు సర్కిల్ లో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్..మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ నేను ఇక్కడ వేదికపై ఉన్నానంటే దానికి కారణం ఎదురుగా ఉన్న నమ్మకమైన తెలుగుదేశం కార్యకర్తలే. నేను ఎన్టీఆర్ మనవడిగానో, సీఎం చంద్రబాబు నాయుడు తనయుడిగానో కాకుండా, పసుపు జెండాను గుండెల్లో మోసే సాధారణ కార్యకర్తగా మీ ముందుకు వచ్చాను. అనంతపురం జిల్లా ఎప్పుడూ టీడీపీకి అండగా నిలిచింది. ఎన్టీఆర్ గారిని, హరికృష్ణ గారిని, బాలకృష్ణ ని గెలిపించి అసెంబ్లీకి పంపిన ఘనత ఈ నేలది. పరిటాల రవి గారు కార్యకర్తల కోసం ఎల్లప్పుడూ అండగా నిలబడ్డారు. వారు చూపిన ధైర్యం, క్రమశిక్షణతో మనమందరం కలిసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నారు.ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ రాప్తాడులో ఎన్టీఆర్, పరిటాల రవి గారి విగ్రహాలు ఏర్పాటు చేయాలని కార్యకర్తలు దాదాపు 20 ఏళ్లుగా కోరుతున్నారు. ఆ నిరీక్షణ ఈరోజుతో నెరవేరింది. మేము విగ్రహాల ఆవిష్కరణకు ఆహ్వానించగానే మంత్రి లోకేష్ బాబు వెంటనే అంగీకరించి ఇక్కడికి రావడం ఎంతో ఆనందదాయకం. చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాయలసీమకు కృష్ణా జలాలు, పరిశ్రమలు, సంక్షేమ పథకాలు వచ్చాయి అని అన్నారు.



## వడ్డే రామారావు కుటుంబానికి టిడబ్ల్యూజేఎఫ్ భరోసా



ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: సీనియర్ జర్నలిస్ట్ వడ్డే రామారావును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా బృందం మంగళవారం రాత్రి పరామర్శించింది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆయన తండ్రి వడ్డే నాగయ్య చిత్రపటానికి ఫెడరేషన్ నాయకులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ నేతృత్వంలో రమణగుట్టలోని రామారావు నివాసానికి వెళ్లిన నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ ప్రజా సేవలో సర్పంచ్‌గా, ఉపసర్పంచ్‌గా, కమ్యూనిస్టు నాయకుడిగా వడ్డే నాగయ్య చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు రామారావు కృషి చేయాలని ఆకాంక్షించారు. 'ఈ కష్ట సమయంలో మీకు అండగా ఫెడరేషన్ ఉంటుంది' అంటూ రామారావుకు భరోసా ఇచ్చారు. యువతరానికి వడ్డే రామారావు అనుభవం, సలహాలు, సూచనలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. వడ్డే నాగయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతోష్ చక్రవర్తి, జిల్లా సహాయ కార్యదర్శి యాకేష్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానీ పాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొర కొప్పుల రాంబాబు, యూనియన్ నాయకులు ఎస్వీ రెడ్డి, రోశి రెడ్డి, మురళి, కుంభం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లక్కవరం ఏకలవ్య మోడల్ స్కూల్

**ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ కైవసం**



చింతూరు, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఈనెల 17,18, 19 తేదీలలో రంపచోడవరంలో జరిగిన ఏకలవ్య పాఠశాలల క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలలో లక్కవరం ఏకలవ్య స్కూల్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ పోటీలలో మొత్తం తొమ్మిది ఏకలవ్య పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ విభాగంలో 36 స్వర్ణ పతకాలు, 11 రజత పతకాలు,8 కాంస్య పతకాలను లక్కవరం ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు సాధించడం జరిగింది. 19 ఏళ్ల లోపు బాలికల విభాగంలో వాలీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్,ఖో ఖో,చెస్ పోటీలలో లక్కవరం పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం పొందారు.అలాగే యోగా లో ద్వితీయ స్థానం సాధించారు. 19 ఏళ్ల లోపు బాలుర విభాగంలో ఖో ఖో, హ్యాండ్ బాల్ లలో ప్రథమ స్థానం సాధించారు. అలాగే వాలీబాల్ పోటీలో ద్వితీయ స్థానం సాధించారు.క్రీడలలో అద్భుత ప్రతిభ చాటిన పాఠశాల విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ సింగ్ అభినందించారు. పోటీలలో విద్యార్థులు ప్రతిభ చాటడంలో కీలకపాత్ర వహించిన పి.ఈ.టి గంగాధర్, ప్రిన్సిపాల్ దిలీప్ సింగ్ అభినందించారు.

# ఖమ్మం జిల్లాలో పీహెచ్‌సీల్లో వైద్య సేవలు గాలికేనా

**- కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటుపై తీవ్ర ఆరోపణలు**

**- ప్రజల ప్రాణాలకు రక్షణగా ఉండాల్సిన కేంద్రాల్లోనే వైద్య సేవలు కరువు**

ఖమ్మం, సెప్టెంబర్ 22, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లాలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర సమయాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రమాదాలు, ఆకస్మిక అనారోగ్య పరిస్థితులు ఎదురైనప్పుడు తక్షణ చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి మండల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆరోగ్య కార్యకర్తలను నియమించింది. ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందేలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిపై ఉంది. అయితే ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

### కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ఫిర్యాదుల వెల్లువ

### - వైద్యులు అందుబాటులో లేకపోతే అత్యవసర రోగుల పరిస్థితి ఏమిటి

సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నిర్దేశిత సమయాల్లో అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో గ్రామీణ ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆశ్రయించిన సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోతే వారి పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. చిన్నపాటి అనారోగ్య సమస్యలు కూడా సమయానికి చికిత్స అందకపోతే తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు, పాము కాట్లు, గుండె సంబంధిత సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, తీవ్ర జ్వరం వంటి అత్యవసర పరిస్థితుల్లో వైద్యుడు అందుబాటులో ఉండటం అత్యంత కీలకం.

### ప్రజల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే వైద్యులు కనిపించరా

### - లక్షల రూపాయల ప్రజాధనంతో వేతనాలు, మరి సేవలు ఎక్కడ

ప్రభుత్వ వైద్య వ్యవస్థలో భాగంగా ప్రతి మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆరోగ్య కార్యకర్తలను ప్రభుత్వం నియమిస్తోంది. వీరికి ప్రజల పన్నుల రూపంలో సమకూరే ప్రభుత్వ నిధుల నుంచే వేతనాలు చెల్లిస్తున్నారు. ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో సంబంధిత సిబ్బంది విధులకు హాజరవుతున్నారా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా అన్నది పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

### - ఒక్క కల్లూరు లోనే కాదు మరికొన్ని కేంద్రాల పరిస్థితి ఏమిటి

### - జిల్లాలోని ఇతర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందా

కల్లూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై మాత్రమే కాకుండా ఖమ్మం జిల్లాలోని మరికొన్ని మండలాల్లో కూడా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు వాస్తవమా? లేక సిబ్బంది విధుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు సరైన సమాచారం అందడం లేదా? అన్నది అధికారిక తనిఖీల ద్వారా తేలాల్సి ఉంది. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధుల పట్టిక, హాజరు నమోదు, రాత్రి విధులు, అత్యవసర సేవల నిర్వహణ, రోగుల నమోదు వంటి అంశాలను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### వైద్యుల విధులపై ఉన్నతాధికారుల తనిఖీలు జరుగుతున్నాయా

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది విధులకు హాజరవుతున్నారా ప్రజలకు అవసరమైన సమయంలో సేవలు అందుతున్నాయా? అన్నది నిరంతరం పరిశీలించాల్సిన బాధ్యత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై ఉంటుంది. ఒక కేంద్రంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడం వంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. అయితే జిల్లాలోని కొన్ని కేంద్రాల్లో సిబ్బంది అందుబాటుపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ పర్యవేక్షణ వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తోందన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

### విధులకు గైర్హాజరుపై చర్యలు తీసుకుంటున్నారా

### - హాజరు నమోదు నుంచి అత్యవసర సేవల వరకు సమగ్ర తనిఖీ అవసరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది విధులకు గైర్హాజరవుతున్నారనే ఫిర్యాదులు నిజమైతే వాటిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో తప్పుడు ఆరోపణలు ఉంటే వాటిని కూడా అధికారిక విచారణ ద్వారా స్పష్టం చేయాలి. విధులకు హాజరుకాకుండా వేతనాలు పొందుతున్నారనే ఆరోపణలు ఉంటే హాజరు నమోదు, విధుల పట్టిక, బయోమెట్రిక్ నమోదు, రోగుల నమోదు పుస్తకాలు, అత్యవసర సేవల వివరాలు వంటి రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

### 'వసూళ్ల' ఆరోపణలపై సమగ్ర విచారణకు డిమాండ్

### - విధులకు సక్రమంగా హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకోకుండా మౌనం ఎందుకు

విధులు సక్రమంగా నిర్వహించని కొందరు వైద్యులు, సిబ్బంది నుంచి సంబంధిత అధికారులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ప్రజల్లో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ ఉన్నదా అన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్న నేపథ్యంలో జిల్లా స్థాయి అధికారులు నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమైతే ఆ విషయాన్ని కూడా ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదే.

### రికార్డులు పరిశీలిస్తే అసలు నిజం బయటపడుతుందా

### - హాజరు పుస్తకాలు, విధుల పట్టికలు, రోగుల నమోదు వివరాలపై దృష్టి

కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఖమ్మం జిల్లాలోని ఇతర కేంద్రాల్లోనూ గత కొన్ని నెలల హాజరు వివరాలు, వైద్యుల విధుల పట్టికలు, రాత్రి విధుల నమోదు, అత్యవసర కేసుల వివరాలు, రోగుల నమోదు పుస్తకాలు, మందుల వినియోగ వివరాలు, ఫిర్యాదుల నమోదు పుస్తకాలను పరిశీలిస్తే వైద్య సేవలు వాస్తవంగా ఎలా కొనసాగుతున్నాయో స్పష్టమయ్యే అవకాశం ఉంది. అవసరమైతే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది వాస్తవంగా విధుల్లో ఉన్నారా? ప్రజలకు సేవలు అందుతున్నాయా అన్నది అధికారులు నిర్ధారించాలి.

### ప్రజల ప్రాణాల విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదు

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రజల డిమాండ్

గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే తొలి వైద్య ఆధారం. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలు అత్యవసర సమయంలో ప్రభుత్వ వైద్య వ్యవస్థపైనే ఆధారపడుతుంటాయి. అలాంటి వ్యవస్థలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో లేకపోవడం నిజమైతే అది తీవ్రమైన సమస్యగా పరిగణించాల్సిందే. అందువల్ల ఖమ్మం జిల్లా ఉన్నతాధికారులు కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుంచాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికారుల సమాధానం ఏమిటి

### - కల్లూరు లో వైద్య సేవలపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదే

కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. విధులకు గైర్హాజరవుతున్న సిబ్బంది ఎవరైనా ఉన్నారా? ఉంటే వారిపై ఇప్పటివరకు ఏ చర్యలు తీసుకున్నారు? రాత్రి వేళల్లో అత్యవసర వైద్య సేవలు ఎలా అందిస్తున్నారు జిల్లాలోని ఇతర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది హాజరును ఎలా పర్యవేక్షిస్తున్నారు? అనే ప్రశ్నలకు అధికారిక సమాధానం రావాల్సి ఉంది.ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ వైద్య వ్యవస్థకు ప్రాథమిక లక్ష్యం. పేద ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వైద్య సేవలు కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో నిజంగా అందుతున్నాయా అన్నది తేలాల్సిన అవసరం ఉంది. కల్లూరు కేంద్రంగా వెలువడుతున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిగితే ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య వ్యవస్థలో ఉన్న లోపాలు, బలహీనతలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది మరి.

# విజయ్ దేవరకొండ 'రణబాలి' టీజర్.. ఊచకోతలో ఓ ట్విస్ట్




విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యన్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'టాక్సీవాలా' మంచి హిట్ కొట్టింది. ఇప్పుడు వీరిద్దరూ కలిసి ఏకంగా బ్రిటీష్ కాలం నాటి పీరియాడిక్ కథతో వస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, టీ సిరీస్ నిర్మాణంలో రూపొందుతున్న సినిమా 'రణబాలి'. ఇక ఫస్ట్ లుక్ నుంచే క్యూరియాసిటీ క్రియేట్ చేస్తున్న టీజర్ వచ్చేసింది. సీన్స్ చూస్తే విజయ్ తన లవర్ బాయ్ ఇమేజ్‌ను పూర్తిగా చెరిపేసుకుని, ఒక రా అండ్ రస్టిక్ వారియర్‌గా కనిపించి సర్ప్రైజ్ చేశారు. 1876-78 నాటి గ్రేట్ మద్రాస్ ప్రెసిడెన్సీ కరువు నేపథ్యంలో 80 లక్షల మంది భారతీయులు ఆకలితో చనిపోయిన దారుణమైన రోజులను టీజర్ ఆరంభంలో చూపించారు. అన్నపూర్ణ లాంటి దేశంలో గింజల కోసం ప్రజలు అల్లాడుతుంటే, బ్రిటీష్ పాలకులు చేసే అకృత్యాలు కంటతడి పెట్టించే ఎమోషన్‌ను క్రియేట్ చేశాయి. ఆకలి కేకలు, ఎండిపోయిన మట్టి నేలల విజువల్స్ చాలా హార్డ్ హిట్టింగ్‌గా డిజైన్ చేశారు. ఈ అణచివేతకు వ్యతిరేకంగా గొంతెత్తిన యోధుడిగా 'సింగనమల బొబ్బిలి రణబాలి' పాత్రలో విజయ్ దేవరకొండ ఎంట్రీ ఇచ్చారు. ఒంటినిండా రక్తపు చారలు, చేతిలో పెద్ద కొడవలి పట్టుకుని గుర్రంపై వచ్చే షాట్స్, బ్రిటీష్ సైన్యంపై విరుచుకుపడే విధానం మాస్ ఆడియన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. రాయలసీమ యాసలో "నేను కాయలి కాసాండంగా ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదబ్బా" అంటూ విజయ్ చెప్పిన డైలాగ్ డెలివరీ ఇంటెన్స్‌గా కుదిరింది. విజువల్స్ పరంగా సినిమాటోగ్రఫీ చాలా రిచ్‌గా, డస్టీ టోన్‌తో పీరియాడిక్ ఫీల్‌ను పర్ఫెక్ట్‌గా రీక్రియేట్ చేసింది. దానికి తోడు అజయ్ అతుల్ అందించిన నేపథ్య సంగీతం సన్నివేశాల్లోని ఆక్రోశాన్ని, ఎమోషన్‌ను



అమాంతం పెంచేసింది. హీరోయిన్ రష్మిక మందన్న ఒక భావోద్వేగ సన్నివేశంలో కనిపించి ఆకట్టుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ స్కేల్, రాహుల్ సాంకృత్యన్ విజన్ ప్రతి ఫ్రేమ్‌లోనూ భారీగా హైలెట్ అయ్యాయి. గతంలో వచ్చిన రొటీన్ ఫార్ములా కాకుండా, చరిత్రలోని ఒక బలమైన విషాదాన్ని, దానిపై జరిగిన తిరుగుబాటును ఎంచుకోవడం ఈ ప్రాజెక్ట్‌కి అసలు బలం. విజయ్ తన కెరీర్‌లోనే మునుపెన్నడూ చూడని అత్యంత వయొలెంట్, పవర్‌ఫుల్ అవతారంలో మెప్పించారు.



# సంక్రాంతి నుంచి సమ్మర్ వరకు అందరికీ ఇబ్బందే!




ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం -ఫౌజీ- విడుదల తేదీపై ఓ ఆసక్తిర చర్చ సాగుతోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ తేదీ మారితే గనుక రాబోయే పెద్ద సినిమాల షెడ్యూళ్లు .. పండుగ సీజన్లపై దాని తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. -ఫౌజీ- డిసెంబర్ నుంచి వాయిదా పడితే దాని ప్రభావం మొదటగా పడేది సంక్రాంతి సీజన్‌పైనే. టాలీవుడ్‌లో సంక్రాంతి అనేది అత్యంత లాభదాయకమైన రేస్. ప్రభాస్ వంటి పాన్-ఇండియా స్టార్ సినిమా సంక్రాంతి బరిలోకి వస్తే? ఇతర పెద్ద సినిమాల విడుదల తేదీలు మారక తప్పదు. దీంతో 2027 సంక్రాంతి రేస్‌లో ఉండాలనుకున్న పలు క్రేజీ ప్రాజెక్టులు థియేటర్ల సర్దుబాటు కోసం ప్లాన్స్‌ను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మార్పుల ప్రభావం 2027 మార్చి నెలాఖరు వరకు కొనసాగే అవకాశాలున్నాయి. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తోన్న మరో క్రేజీ ప్రాజెక్ట్ -స్పిరిట్-ను మార్చి 5న విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నారు. ఒకవేళ -ఫౌజీ- విడుదల ఆలస్యమైతే? ఆ ప్రభావం -స్పిరిట్- ప్రమోషన్లు , నిర్మాణ షెడ్యూళ్లపై పడి ఆ సినిమా విడుదల కూడా వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది. ఒకే హీరో రెండు భారీ చిత్రాలు అతి తక్కువ వ్యవధిలో రావడం వ్యాపారపరంగా సాధ్యం కాదు కాబట్టి ఈ చిక్కులు తప్పవు. దీంతో పాటు 2027 సమ్మర్ రిలీజ్ ప్లాన్స్ కూడా పూర్తిగా డిస్టర్బ్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా టాలీవుడ్ పెద్ద సినిమాలు వేసవి సెలవులను టార్గెట్ చేస్తూ డేట్లను ముందే లాక్ చేసుకుంటాయి.

# 100 కోట్లకు పైగా థియేట్రికల్ లాభాలు సాధించిన సినిమాలెన్ని?

తెలుగు పరిశ్రమ స్థాయి పాన్-ఇండియా రేంజ్‌కు పెరిగిన తర్వాత వందల కోట్ల వసూళ్లు సాధించడం సాధారణ విషయంగా మారింది. అయితే ఒక సినిమా బాక్సాఫీస్ వద్ద కేవలం 100 కోట్లు.. 200 కోట్లు గ్రాస్ వసూలు చేయడం వేరు.. థియేట్రికల్ హక్కుల కొనుగోలు వ్యయం పోను బిజినెస్ పరంగా డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు ఏకంగా 100 కోట్లకు పైగా నికర లాభాలు అందించడం వేరు. టాలీవుడ్ చరిత్రలోనే కేవలం థియేట్రికల్ రన్ ద్వారానే 100 కోట్ల ప్రాఫిట్ మార్కును అందుకున్న సినిమాలు చాలా అరుదుగా ఉంటాయి. ఆ అరుదైన ఫీట్ సాధించిన ఎనిమిది చిత్రాలున్నాయి. ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచినవి రాజమౌళి దృశ్యకావ్యాలు -బాహుబలి: ది బిగినింగ్-, -బాహుబలి: ది కన్క్లూజన్-, -'ఆర్ఆర్ఆర్-. -బాహుబలి 1- తెలుగు సినిమా బాక్సాఫీస్ హద్దులను పూర్తిగా చెరిపేసి నిర్మాతలకు, కొను గోలుదారులకు భారీ లాభాలను తెచ్చిపెట్టింది. ఇక -బాహుబలి 2- ప్రపంచవ్యాప్తంగా 1800 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి, డిస్ట్రిబ్యూటర్లకు వందల కోట్ల ప్రాఫిట్స్ అందించింది. అదే బాటలో ఎన్టీఆర్, రామ్ చరణ్‌లతో రాజమౌళి తెరకెక్కించిన -ఆర్ఆర్ఆర్- కూడా థియేట్రికల్ రన్‌లోనే డిస్ట్రిబ్యూషన్ వర్గాలకు భారీ నికర లాభాలను అందించిన ఆల్‌టైమ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్- సుకుమార్ కాంబినేషన్లో తెరకెక్కిన -పుష్ప 2: ది రూల్-, ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన -కల్కి 2898 ఏడీ- చిత్రాలు పాన్-ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించాయి. ఈ రెండూ భారీ బడ్జెట్ - అత్యధిక థియేట్రికల్ బిజినెస్ జరుపుకున్నా? ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన ప్రభంజనంతో 100 కోట్లకు పైగా నికర లాభాలను అందించి సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. పరిమిత బడ్జెట్‌తో వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన -హనుమాన్- కూడా ఈ జాబితాలో ఉంది. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 300 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. తక్కువ ధరకు థియేట్రికల్ రైట్స్ అమ్ముడవడంతో డిస్ట్రిబ్యూటర్లకు పెట్టుబడిపై కొన్ని రెట్ల లాభం తెచ్చిపెట్టి 100 కోట్ల ప్రాఫిట్ క్లబ్‌లో చేరిన అసాధారణ చిత్రంగా నిలిచింది. అలాగే విక్టరీ వెంకటేష్- అనిల్ రావిపూడి కలయికలో రిలీజ్ అయిన -సంక్రాంతికి వస్తున్నాం- చిత్రం కూడా థియేట్రికల్ రన్‌లో ఈ మైలురాయిని చేరుకుంది. పండుగ రేస్‌లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద 250 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించి కొనుగోలుదారులందరికీ 100 కోట్లకు పైగా నికర లాభాలను అందించి వెంకటేష్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ప్రాఫిటబుల్ సినిమాగా రికార్డు సృష్టించింది. ఇటీవల మాస్ మహారాజా రవితేజ- శివ నిర్వాణ కాంబినేషన్‌లో రిలీజ్ అయి సరికొత్త చరిత్ర సృష్టించిన -ఇరుముడి- చిత్రం కూడా అరుదైన జాబితాలో చేరింది. తక్కువ బడ్జెట్...బిజినెస్ రేంజ్ లో రిలీజ్ అయిన -ఇరుముడి- 200 కోట్లకు పైగా గ్రాస్ సాధించి కొనుగోలుదారులకు ఊహించని రీతిలో 100 కోట్లకు పైగా నికర లాభాలను అందించింది. ఇలా ఎనిమిది చిత్రాలు తెలుగు పరిశ్రమ స్థాయిని, బిజినెస్ పొటెన్షియల్‌ను చాటి చెప్పాయి.




# గ్లామర్ వెనుక అసలైన కష్టం.. తెర వెనుక ఫ్యాక్ట్ బయటపెట్టిన రాశి సింగ్ !

చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తిని పెంచుకున్న ప్రముఖ బ్యూటీ రాశి సింగ్ కి.. 14 ఏళ్ల వయసులోనే ఒక కమర్షియల్ యాడ్ లో అవకాశం వచ్చినా. వ్యక్తిగత కారణాల వల్ల వదులుకుంది. చదువు పూర్తి చేసుకున్న ఈమె తొలిసారి ఇండిగో ఎయిర్ లైన్స్ లో ఎయిర్ హోస్టెస్ గా కెరియర్ ప్రారంభించింది. ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉన్న సమయంలోనే 2019లో జెమ్ అనే తెలుగు చిత్రంతో నటిగా అరంగేట్రం చేసింది. ఆ తర్వాత పోస్టర్, ప్రసన్న వదనం, బ్లైండ్ స్పాట్ , సంతాన ప్రాప్తిరస్తు, ట్రాన్స్ఫర్ త్రిమూర్తులు ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ ఏవి కూడా ఈమెకు అనుకునేంత స్థాయిలో గుర్తింపును అందివ్వలేదు.



## రంభాషీగా రాశి సింగ్..

కానీ రీసెంట్గా అల్లరి నరేష్ హీరోగా వచ్చిన రంభ ఊర్వశి మేనక చిత్రంలో రంభ పాత్రతో అందరి దృష్టిని తన వైపు తిప్పుకుంది రాశి సింగ్. ఈ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోకపోయినా.. ఇందులో ఆమె నటన అందరి దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆమె గ్లామర్ కుర్రకారుకు మంచి ట్రీట్ ఇచ్చింది. అంతేకాదు రంభ పాత్రకు సంబంధించిన గ్లామర్ లుక్ ను ఎప్పటికప్పుడు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేస్తూ.. సినిమాపై అంచనాలు పెంచేసింది. సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోకపోయినా రంభ పాత్రలో రాశి సింగ్ మాత్రం మంచి పేరు దక్కించుకుంది.

## గ్లామర్ వెనుక అసలైన కష్టం..

ముఖ్యంగా ఈ సినిమాలో రంభ పాత్రతో గ్లామర్ హంగులతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె ఇంత అందంగా కనిపించడం వెనుక తాను పడ్డ కష్టాన్ని అభిమానులతో ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. గ్లామర్ వెనుక తాను పడ్డ కష్టం ఇదే అంటూ ఆ ఫోటోలను క్యాప్షన్ కూడా జోడించింది. రాశి సింగ్ ఈ ఫోటోలను షేర్ చేస్తూ.." మీరు తెరపై చూసేది అందం, ఆకర్షణ మాత్రమే. కానీ దానిని నిలబెట్టుకోవడానికి పడే కష్టం మీకు కనిపించదు. సరైన ఆహారం తీసుకోవడం, నా శరీరాన్ని, చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం.. ఫిట్గా ఉండడం, చల్లని రాత్రులలో, అర్ధరాత్రి వేళల్లో షూటింగ్ చేయడం, ఒళ్ళు నొప్పులు భరించడం.. అయినా కూడా ప్రదర్శన ఇవ్వడానికి తగినంత శక్తిని కలిగి ఉండడం.. అలాగే నన్ను రంభాషి అని పిలిచిన వాళ్లందరూ గెలిచారు. నేను ఆ పేరు నే ఉంచుకుంటాను. ఈ లుక్కును, నన్ను హ్యాండిల్ చేసిన నా టీం కి ప్రత్యేక ధన్యవాదాలు" అంటూ తెర వెనుక ఆ పాత్ర కోసం ఆమె పడ్డ కష్టాన్ని అభిమానులతో పంచుకుంది.



## తెర వెనుక కష్టాలను పంచుకున్న రాశి సింగ్..

ముఖ్యంగా రంభ పాత్ర కోసం ఆమె రెడీ అవుతున్న ఫోటోలను అలాగే నిప్పులతో చేతులను కాచుకుంటున్నట్టు ఇలా కొన్ని ఫోటోలను ఆమె షేర్ చేశారు . ఏదేమైనా సెలబ్రిటీలు మనకు వినోదాన్ని పంచుతున్నారు అంటే.. తెర వెనుక వారు పడే కష్టం ఎలా ఉంటుందో చెప్పడం వర్ణనాతీతం. ప్రస్తుతం రాశి సింగ్ షేర్ చేసిన ఫోటోలు, పంచుకున్న క్యాప్షన్ అభిమానులలో, నెటిజన్స్ లో సెలబ్రిటీస్ పై మరింత గౌరవాన్ని పెంచుతున్నాయి.

# ఇప్పుడు టి20 శైలికి మారిపోతా!

## హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ వ్యాఖ్య

## అఫ్గాన్‌తో సిరీస్‌కు సిద్ధమన్న హైదరాబాదీ

చెన్నై: దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్ కెప్టెన్‌గా రెండు మ్యాచ్‌లు ఆడిన ఠాకూర్ తిలక్ వర్మ మూడు ఇన్నింగ్స్‌లలో వరుసగా 116 నాటౌట్, 51 నాటౌట్, 99 పరుగులు (మొత్తం 266) చేశాడు. టి20 స్పెషలిస్ట్‌గానే ప్రస్తుతం భారత జట్టులో ఉన్న తిలక్... ఫస్ట్ క్లాస్ ఆట శైలికి తగినట్లుగా తన బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. దులీప్ ట్రోఫీ సెమీస్, ఫైనల్ మ్యాచ్ కలిపి 461 బంతులు ఎదుర్కొన్న అతను... ఫైనల్ మ్యాచ్‌లో పరిస్థితికి అనుగుణంగా ఆడుతూ ఒకదశలో వరుసగా 63 బంతులపాటు బౌండరీ కొట్టకుండా నియంత్రణ కూడా ప్రదర్శించాడు. దీనికి ముందు భారత 'ఎ' జట్టుకు కూడా తిలక్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. 'నా వ్యక్తిగత ఫామ్ చాలా బాగుంది. ఈ ప్రదర్శనతో నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోనూ నా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చానని భావిస్తున్నా. ఈ మ్యాచ్‌లో కాస్త ముందుగానే దూకుడు ప్రదర్శించగలిగేవాడిని. కానీ పరిస్థితులకు, జట్టు అవసరాలకు తగినట్లు ఆడటమే ముఖ్యం. నాతో పాటు అవతలి ఎండ్‌లో మరో బ్యాటర్ నిలిస్తే సెషన్లవారీగా ఆడుతూ డ్రా కోసం ప్రయత్నించేవాడిని. కానీ వరుసగా వికెట్లు కోల్పోవడం ఈస్ట్‌కు మేలు చేసుంది. భారత 'ఎ' జట్టుకు, ఇప్పుడు సౌత్‌జోన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం వల్ల ఇతర యువ ఆటగాళ్ల నుంచి ఎంతో నేర్చుకునే అవకాశం లభించింది. సారథిగా నేను ఎదుగుతున్నాననే భావన కలిగింది. కొన్ని సార్లు పరిస్థితులు మనకు అనుకూలంగా లేనప్పుడే కెప్టెన్‌గా నా బాధ్యత మరింత పెరుగుతుంది' అని తిలక్ అభిప్రాయపడ్డాడు. ఈ నెల 13 నుంచి అఫ్గానిస్తాన్‌తో జరిగే టి20 సిరీస్‌లో భారత జట్టును గెలిపించడంపైనే ప్రస్తుతం దృష్టి పెట్టినట్లు తిలక్ వెల్లడించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి ఒక్కసారిగా టి20లకు మారడం తనకు కష్టమేమీ కాదని, సిరీస్‌కు సిద్ధంగా ఉన్నానని అతను చెప్పాడు. 'ఇప్పుడు నా బ్యాటింగ్ గేర్లు మార్చి దూకుడు ప్రదర్శిస్తా. నా ఆటపై నాకు చాలా నమ్మకం ఉంది. ఇప్పుడు అఫ్గానిస్తాన్‌తో సిరీస్ గెలవడమే లక్ష్యం. ఎరుపు రంగు బంతి మ్యాచ్ నుంచి టి20లకు మారడం అంత సులువు కాదు. అయితే సిరీస్‌కు ముందు ప్రాక్టీస్ కోసం నాకు రెండు రోజుల సమయం లభిస్తోంది. నా ఆట శైలిని మార్చుకునేందుకు ఇది సరిపోతుంది' అని తిలక్ వ్యాఖ్యానించాడు. భారత్ తరఫున ఇప్పటి వరకు 64 టి20 మ్యాచ్‌లు ఆడిన తిలక్ 145.18 స్ట్రయిక్‌రేట్‌తో 1645 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 9 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతను మరో 5 వన్డేల్లో కూడా బరిలోకి దిగాడు.

